Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com | సంపుటి :2 | సంచిక: 38 | హైదరాబాద్ | 29 మంగళవారం, అక్టోబర్ 2024 | పేజీలు: 8 | రూ.3/-

## రహస్య కెమెరాలకు చెక్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ) :**

బెడ్రూం కార్యకలాపాలు ఇటీవల సోషల్ మీడియాకెక్కి పరువును గంగపాలు చేస్తున్నాయి. ఈ ప్రైవేటు కార్యం రహస్య కెమెరాలకు చిక్కడంతో బోల్డన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో మధురంగా ఉండాల్సిన ఏకాంత క్షణాలు చేదు గుళికలుగా మారిపోతున్నాయి. అయితే, ఇకపై ఎలాంటి బెరుకు లేకుండా, తమను ఫొటోలు, వీడియోలు తీస్తారన్న భయం లేకుండా నిశ్చింతగా ఆ మధుర క్షణాలను ఆస్వాదించవచ్చు. ఇందుకోసం జర్మన్ సెక్సువల్ హెల్త్ బ్రాండ్ 'బిల్లీ బాయ్' సరికొత్త యాప్‌ను ఆవిష్కరించింది. కమ్‌డోమ్"గా పిలిచే ఈ యాప్ 'డిజిటల్ కండోమ్"గా వ్యవహరిస్తుంది. ఏకాంతంలో ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్లలోని కెమెరాలు, మైక్రోఫోన్లు పనిచేయకుండా ఈ యాప్ అడ్డుకుంటుంది. ఇకపై ఏకాంతంలో మనకు తెలియకుండా ఆ సీన్లను వీడియోలు, ఫొటోలు తీయడం, ఆడియోను రికార్డు చేయడం జరగదని బిల్లీబాయ్ పేర్కొంది. ఈ యాప్‌ను 30 దేశాల్లో విడుదల చేశారు. ఇది బ్లూటూత్ సాంకేతికతతో సమీపంలోని స్మార్ట్‌ఫోన్లను నిర్వీర్యం చేసి ఏకాంతాన్ని ఆహ్లాదంగా మారుస్తుంది. ఎవరైనా వీడియోలు, ఫొటోలు తీయాలనుకున్నా కమ్‌డోమ్ యాప్ వెంటనే రియాక్ట్ అవుతుంది. అలారం మోగి యూజర్లను అప్రమత్తం చేస్తుంది.




## రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రక్షాళన

### డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రక్షాళన ప్రారంభమైంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు నాడే అక్టోబర్ 28న 70 అధికారులను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణలో డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. 47 మంది డిప్యూటీ, 23 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల అదనపు కలెక్టర్లు, 4 జిల్లాల డీఆర్వోలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ డిపార్ట్ మెంట్‌లో మొత్తం 70 మంది డిప్యూటీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. ఇటీవల రెవెన్యూ సంఘాలు పదోన్నతులు, బదిలీల గురించి ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాయి.

వివరాలు 2లో

## రేవంత్ పాలనలో రోడ్డెక్కనిది ఎవరు



- ఫీజు రియంబర్స్‌మెంట్..రైతు భరోసా ఏమ్యింది
- 11 నెలల పాలనలో అన్నీ మోసలే
- నిరుద్యోగులకు భృతి లేదు..నియామకాలు లేవు
- ప్రభుత్వం విఫలమై ప్రతిపక్షంపై దాడి చేస్తోంది
- రేవంత్ పాలనపై హరీష్ రావు మండిపాటు

**హైదరాబాద్,అక్టోబర్28 (తెలంగాణ వీణ):**

రేవంత్ రెడ్డి నీ పాలనలో.. మోసం చేయనిది ఎవర్ని..? రోడ్డు మీదకు తీసుకురానిది ఎవర్ని..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అన్ని కోణాల్లో ఈ ప్రభుత్వం విఫలమై దిక్కుతోచక ప్రతిపక్షంపై దాడులు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజాపాలన తొలగిపోయి.. కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయలైందని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.ఈ రాష్ట్రంలోని విద్యార్థులను, నిరుద్యగులు, ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి నట్టేట ముంచారు. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనకు ఒక్క నెల మిగిలింది. కనీసం 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చావా..? నిరుద్యోగులను దగా చేశావు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో అడిగితే హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడారు. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తా అన్నావు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇప్పటి వరకు కూడా నయా పైసా ఇవ్వలేదు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ మానవీకోణంలో ఆలోచించి కొనసాగించారు. కకాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే.. నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు ఇస్తానని మాటిచ్చావు. పెండింగ్‌లో బిల్లులు క్లియర్ చేస్తా అన్నావు. పీఆర్సీ ప్రకటించి వేతనాలు పెంచుతానని ప్రకటించావు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. పీఆర్సీ ఉలుకే లేదు.

వివరాలు 2లో

## రాజ్ పాకాలకు రెండ్రోజుల సమయం ఇవ్వండి

### జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో హైకోర్టులో విచారణ

- విచారణకు హాజరు కాని విజయ్ మద్దూరి
- తన ఫోన్ బదులు మరొకరి ఫోన్ ఇచ్చిన విజయ్
- కేటీఆర్ సతీమణిని విచారించిన పోలీసులు



**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**


జన్వాడ ఫామ్ హౌస్ కేసుకు సంబంధించి కేటీఆర్ బామ్మర్ది రాజ్‌పాకాల దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విచారణకు హాజరయ్యేందుకు రాజ్‌పాకాలకు 2 రోజుల సమయం ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. జన్వాడ ఫామ్ కేసు విచారణలో ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసుల తరఫున ఏఏజీ కోర్టుకు తెలపగా.. నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లాలని న్యాయస్థానం సూచించింది.కాగా, తెలంగాణలో సంచలనం సృష్టించిన జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని పోలీసులు ఈ కేసులో ఏ1, ఏ2 నిందితులుగా చేర్చారు. ఈ క్రమంలో జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని.. తనను అరెస్ట్ చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టులో రాజ్ పాకాల లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పోలీసుల ముందు హాజరయ్యేందుకు రాజ్ పాకాలకు రెండు రోజుల సమయం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, జన్వాడ్ ఫామ్ కేసులో కీలక నిందితుడైన రాజ్ పాకాల నివాసం ఓరియన్ విల్లాలో ఆదివారం పోలీసులు సోదాలు చేశారు. అనంతరం పరారీలో ఉన్న రాజ్ పాకాలకు విచారణకు హాజరు కావాలంటూ ఆయన నివాసానికి నోటీసులు అంటించి వెళ్లారు.

వివరాలు 2లో

## దేశవ్యాప్తంగా దీపావళి పండగ శోభ

### స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు


- ధన త్రయోదశికి ఆఫర్లు ప్రకటించి వ్యాపారులు



**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

దేశవ్యాప్తంగా దీపావళి పండగ శోభ వచ్చేసింది. దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మి దేవిని ఆడ పడుచులు పూజిస్తారు. తమకు సిరి, సంపదలు కలుగజేయాలని కోరతారు. అన్నింటికి మంచి ధన త్రయోదశి రోజు బంగారం కొనాలన్న కోరిక ఉంది. ధన త్రయోదశికి వ్యాపారులు ఆఫర్లు ప్రకటించారు. పండగ సమయంలో బంగారం, వెండి కొనడం కామన్. పసిడి ప్రియులకు బంగారం లాంటి వార్త. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. తెలుగు రాష్ట్రాల్లోనే.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం వెండి ధరలు ఎలా కొంచెం తగ్గాయి. అయితే పెరిగినప్పుడు వేలల్లో పెరగడం, తగ్గినప్పుడు మా÷–తరం వందల్లో తగగ్గడం మార్కెట్ పరిస్థితికి అద్దం పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, ద్రవ్యోల్బణం, రూపాయితో డాలర్ మారకం విలువ ఆధారంగా బంగారం ధరలో మార్పు జరుగుతుంటుంది. హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.73, 590గా ఉంది. విజయవాడ, విశాఖపట్టణం లో కూడా ఇదేవిధంగా ఉంది. 22 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.80,280గా ఉంది. విజయవాడ విశాఖపట్టణంలో కూడా ఇదేవిధంగా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.73,590గా ఉంది. కోల్ కతాలో రూ.73,590గా ఉంది.

వివరాలు 2లో



## 'గగన్‌యాన్' మిషన్‌పై ఇస్రో కీలక అప్‌డేట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ):**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక ప్రకటన చేశారు. అంతరిక్షానికి మినిషిని పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్' మిషన్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముందుగా అనుకున్నట్లు 2025లో కాకుండా.. ఈ మిషన్‌ను 2026లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆల్ ఇండియా రేడియోలో సర్దార్ పటేల్ మెమోరియల్ లెక్చర్ సందర్భంగా సోమనాథ్ ఈ కొత్త షెడ్యూల్‌ను వెల్లడించారు.

వివరాలు 2లో

## టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

### స్పెయిన్ ప్రధానితో రోడ్ షో

- లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ

**గాంధీనగర్, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ) :**




భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా–ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోజు (సోమవారం) ఇరుదేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు.

వివరాలు 2లో

## మీ బామ్మర్ది పార్టీలో అమ్మాయిలు ఎవరు

### వారి వివరాలు వెంటనే ప్రకటించండి

- తప్పు చేసినా ఇంకా బుకాయింపా
- కెటిఆర్ తీరుపై షబ్బీర్ అలీ మండిపాటు



**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**


మీ బామ్మర్ది ఫామ్ హౌస్‌లో దొరికిన డ్రగ్స్, లిక్కర్, అమ్మాయిలు, అబ్బాయిల వివరాలు అన్ని బయటపెట్టాలని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. జన్వాడలో కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్ హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ ఘటనపై షబ్బీర్ అలీ స్పందించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. . అడ్డంగా దొరికి కూడా బుకాయించడానికి సిగ్గు, శరం ఉందా కేటీఆర్ అంటూ ఘాటు విమర్శలు చేశారు. ముందుగా కేటీఆర్ నార్కో టెస్ట్ చేయించుకోవాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. ప్రతి వారం కేటీఆర్ బామ్మర్ది రేవ్ పార్టీ పెడుతున్నారని పోలీసులకు సమాచారం ఉందని.. పక్కా ఇన్ఫర్మేషన్‌తోనే పోలీసులు దాడి చేశారని తెలిపారు. గతంలో జన్వాడ ఫామ్ హౌస్‌కు నాకు సంబంధం లేదు అన్నావ్..

వివరాలు 2లో

## నగరంలో నెలరోజుల పాటు ఆంక్షలు

### అశాంతి సృష్టించేందుకు కొందరు యత్నం: సిపి

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**



హైదరాబాద్ నగరంలో నెలరోజులపాటు ఆంక్షలు విధిస్తున్నామంటూ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అశాంతిని సృష్టించడానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం ఉండటంతో ఆంక్షలు విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నవంబర్ 28 సాయంత్రం ఆరు గంటల వరకు నెల రోజుల పాటు నగరంలో సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఐదుగురికి మించి గుమి కూడితే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. బిఎన్ఎస్ సెక్షన్ 163 (పాత సీఆర్పీసీ 144 సెక్షన్) కింద ఆంక్షలు విధించినట్లు ఆదేశాల్లో వివరించారు. ఇటీవల సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ గుడిపై దాడి ఘటన తర్వాత అల్లర్లు రేగిన సంగతి విదితమే.

వివరాలు 2లో

Title Code : 12280
Email : telanganaveenaofficial@gmail.com
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..

## సంపాదకీయం

# డిజిటల్ అరెస్ట్టలు .. పారాహుషార్..!

డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్ట్టల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయో గించవు. ఎవరైనా ఫోన్‌కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళ్లు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్‌లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో డజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్‌టీ-ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్‌లైన్ కుంభకోణమని సీఈఆర్‌టీ-ఐఎన్ తెలిపింది. నిజానికి వారు ప్రదర్శించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్‌టీ-ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది.'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు.వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్‌షాట్ తీసి, కాల్‌ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు అనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సుల పట్టించుకోవద్దు. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగగవద్ద. సాధ్యమైనంత వరకు కాల్స్ కట్ చేయాలి. బెదరింపులకు పాల్పడే వారిని గుర్తించి ఫిర్యాదు చేయాలి. అంతేగాకుండా మన తోటివారితో చర్చించాలి.

## రేవంత్ పాలనలో
# రోడ్డెక్కనిది ఎవరు

మొదటి పేజీ తరువాయి

ఒక్క డీఏ ఇచ్చి దీపావళి పండుగ జరుపుకోండి అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిర్ణయించిన డీఏనే ఇప్పుడి స్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలు ఇచ్చింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండే.. కనీసం మూడు అయినా ఇస్తావు అనుకుంటే.. ఒక్క డీఏతో సర్దిపెడుతున్నావు. పీఆర్సీ ఇవ్వక, ఓపీఎస్ అమలు చేయక, 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు. 6 వేల మంది టీచర్లు పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మూడేండ్లకు నాలుగేండ్లకు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన చూస్తే ప్రజా పాలన కాదు ప్రజా పీడనగా కనబడుతుంది. ప్రజా పాలన తొలిగిపోయి కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయటలైంది. ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయింది. సీఎం వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికి పోతోందని అన్నారు. దర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..? ఎందుకు చర్చలు జరపడం లేదు. ఎందుకు తిరగబడుతున్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు. హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నవ్. ఇది సీఎం వైఖరి అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఒక్క పంటకు కూడా రైతు బంధు లేదు. పదిహేను వేలు కాదు కదా..? ఉన్న పదివేలు కూడా రావడం లేదు. చివరకు పంటలు కొనే దిక్కు లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. రూ. 7521కు క్వింటాల్ పత్తి కొంటామని మద్దతు ధర ప్రకటించారు. కానీ రైతులు రూ. 5500కు పత్తి అమ్ముకుంటున్న పరిస్థితి. మద్దతు ధర రాకపోతే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు. దిగాలుగా ఉన్న పత్తి రైతుకు.. అండగా నిలవడం లేదు. బోనస్ కాదు కదా.. మద్దతు ధర రావడం లేదు. వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మంలో రైతులు రో÷-డడెక్కితే నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని అన్నారు. కొబ్బరికాయలు కొడుతున్నారు.. కానీ ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. చివరకు వరి ధాన్యాన్ని రూ. 1900కు అమ్ముకుంటున్నారు. రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. మక్క రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. సోయాబీన్ రైతులను పట్టించుకోవడం లేదు. రైతులను రోడ్డు మీదకు తీసుకొచ్చిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలో దాపురించిందని హరీశ్‌రావు తెలిపారు.

## మీ బామ్మర్ది పార్టీలో
# అమ్మాయిలు ఎవరు

మొదటి పేజీ తరువాయి

హైడ్రా ఎపిసోడ్‌తో నా దోస్త్ ఫామ్ హౌస్ అన్నావ్.. ఇప్పుడేమో మా బామ్మర్ది ఇల్లు అంటున్నావ్.. కేటీఆర్ నోరు తెరిస్తే అబద్దాలేనని విమర్శించారు. పార్టీలో లీటర్ లిక్కర్, 6 బీర్లు మాత్రమే ఉండాలని ఎక్సైజ్ నిబంధనలు ఉన్నాయి. కానీ ఆ పార్టీలో పెద్ద ఎత్తున మద్యం పట్టుబడిందని అన్నారు. చట్టం తెలిసిన వ్యక్తులే తప్పులు చేస్తే పోలీసులు కేసులు పెట్టక పోతే ఏం చేస్తారని నిలదీశారు. జన్వాడ ఫామ్ హౌస్ ఘటనపై త్వరలో వాస్తవాలు అన్ని ప్రజల ముందు పెడతామని స్పష్టం చేశారు. గతంలో జన్వాడ ఫామ్ హౌస్‌పై డ్రోన్ ఎగరేసి వాస్తవాలు బయటపెట్టినందుకు చిన్ని పిట్టి కేసులో ఆ రోజు ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. అండర్ ట్రయల్ ముద్దాయిగా జైల్లో పెట్టి రేవంత్ రెడ్డిని చంపాలని చూశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆనాడు జైల్లో రేవంత్ రెడ్డి హత్యకు కుట్ర చేస్తే.. ప్రజల అతడిని ముఖ్యమంత్రిని చేశారన్నారు. కేటీఆర్ హవాయి చెప్పల్ నుండి హవాయి జహజ్ వరకు ఎదిగారు. ఈ ఆస్తులన్నీ ఎక్కడి నుండి వచ్చాయో ఆయన ఆస్తులపై ప్రభుత్వం విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసు విచారణలు అన్ని సీఎం క్యాంప్ ఆఫీసులో జరిగాయి.. కేసీఆర్ ఏమైనా జడ్జా అని ప్రశ్నించారు.

## 'గగన్‌యాన్' మిషన్‌పై ఇస్రో
# కీలక అప్‌డేట్

మొదటి పేజీ తరువాయి

చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో ఆ ఊపుతో.. తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గనన్‌యాన్ యాత్రను చేపట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈ మిషన్ లక్ష్యం. ఆగస్టులో చంద్రయాన్-3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమవుతున్నట్లు ఇస్రో చీఫ్ ఇటీవలే వెల్లడించారు. గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయితా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది. మరోవైపు రానున్న సంవత్సరాల్లో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను కూడా సోమనాథ్ వెల్లడించారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మిషన్‌ను వచ్చే ఏడాది అంటే 2025లోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్-ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లునార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్-5గా సోమనాథ్ పేర్కొన్నారు కాబట్టి చంద్రయాన్-4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

## రాజ్ పాకాలకు రెండ్రోజుల సమయం ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే రాజ్ పాకాల న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇదిలావుంటే జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఫామ్ హౌస్‌లో పార్టీకి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సతీమణిని పోలీసులు విచారించారు. మరోవైపు.. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న విజయ్ మద్దూరి పోలీసుల దర్యాప్తుకు సహకరించ లేదు. ఆదివారం విచారణకు హాజరైన విజయ్ మద్దూరి.. సోమవారం పోలీసుల దర్యాప్తుకు డుమ్మా కొట్టాడు. జన్వాడ ఫామ్ హౌస్‌లో రైడ్ సమయంలో తన మొబైల్ దాచిపెట్టి మరో మహిళ మొబైల్‌ను విజయ్ మద్దూరి తమకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. తన మొబైల్ దొరికితే డ్రగ్స్ లింక్స్ బయటపడతాయన్న భయంతోనే విజయ మద్దూరి వేరే మహిళ ఫోన్ అందజేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దాడుల సమయంలో విజయ్ మద్దూరి సతీమణి ఆయన పక్కనే ఉండగా.. తన సతీమణి నెంబర్ కాకుండా థర్డ్ పర్సన్ నెంబర్‌ను ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో డబ్బులు కాకుండా కాయిన్స్ రూపంలో పేకాట ఆడినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తులో పేకాట ఆడినట్లు తేలితే మరో కేసు నమోదు చేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల సమయంలో పోలీసుల కంటపడకుండా కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాలా పరార్ అయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో రాజ్ పాకాలా, విజయ మద్దూరి నోరు మెదిపితే కేసు దర్యాప్తు ముందుకు సాగుతోందంటున్నారు.

# మంత్రి పొంటులేటికి సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు సీఎం తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, తోటి ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు శభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టారు.



## టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన
# ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

కాగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్' నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్థ వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారు" అని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.

# రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే రెవెన్యూ శాఖలో ఒకే సారి ఇంత పెద్ద సంఖ్యలో బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. పలువురు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, భూ సేకరణ అధికారులు, సివిల్ సప్లయిస్ వంటి శాఖల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేశారు. ఎవరూ ఊహించని రీతిలో వేర్వేరు స్థానాలకు ట్రాన్స్?వర్లు జరిగాయి. ఈ మేరకు సోమవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రా విస్తరణ, కొత్త ఆర్వోఆర్ చట్టం, ధరణి స్థానంలో భూమాత, పెండింగ్ భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ స్థలాల రక్షణ వంటి అనేకాంశాల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగినట్లు తెలిస్తోంది.

## నగరంలో నెలరోజుల పాటు
# ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

దీనికి తోడు గ్రూప్-1 విద్యార్థులు, మూసీ నిర్వాసితులు, బెటాలియన్ పోలీసుల వరుస ఆందోళనలతో హైదరాబాద్‌లో పోలీసులకు శాంతిభద్రతల నిర్వహణ సవాలుగా మారింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ తాజా ఆంక్షలు విధించినట్లు సమాచారం.

## దేశవ్యాప్తంగా దీపావళి
# పండగ శోభ

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో రూ.73,740గా ఉంది. చెన్నైలో రూ.73,590గా ఉంది. ముంబై, కోల్ కతా, చెన్నైలో మేలిమి బంగారం ధర రూ.80,280గా ఉంది. ఢిల్లీలో కాస్త ఎక్కువగా ఉంది. రూ.80,430గా ఉంది. వెండి ధర కూడా పెరిగింది. కిలో వెండిపై రూ.100 పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,06,900గా ఉంది. చెన్నై, కేరళ, విజయవాడ, విశాఖపట్టణంలో ఇలానే ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్ కతా, పుణెలిలో కిలో వెండి ధర రూ.97,900గా ఉంది. బెంగళూరులో కిలో వెండి ధర రూ. 96 వేల 900గా ఉంది. ఇకపోతే ధన త్రయోదశి 2024 వచ్చేసింది. హిందువులకు ముఖ్యమైన పర్వదినాల్లో ఒకటైన ఈ పండగ అక్టోబర్ 29న మంగళవారం జరగనుంది. పవిత్రమైన ఈ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే ఏడాదంతా శుభం జరుగుతుందని, ఆరోగ్యం, సిరిసంపదలు నిండుతాయని హిందువులు విశ్వసిస్తుంటారు. ప్రత్యేకమైన ఈ రోజున ధన్వంతరీ, లక్ష్మీ దేవి, వినాయకుడు, కుబేర దేవతలను పూజిస్తుంటారు. బంగారం, వెండి, రాగి వంటి విలువైన లోహాలు కొనుగోలు చేసి దేవుళ్లను పూజిస్తారు. ముఖ్యంగా బంగారం, వెండి లక్ష్మీదేవికి బాగా ప్రీతికరమైనవి కావడంతో వీటిని కొనుగోలు చేస్తారు. అయితే ధన త్రయోదశి సందర్భంగా బంగారం కొనే విషయంలో కస్టమర్లు అజాగ్రత్తగా ఉండకూడదు. బంగారం స్వచ్ఛతను క్షుణ్ణంగా తనిఖీ చేసుకున్నాకే కొనుగోలు చేయాలి. కొంతమంది వ్యాపారులు తక్కువ స్వచ్ఛత కలిగిన బంగారాన్ని విక్రయించడానికి ప్రయత్నించే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఎలాంటి మోసాలకు తావివ్వకుండా మీకు మీరే స్వచ్ఛతను పరిశీలించు కోవడం చాలా ఉత్తమం. అందుకు సులభమైన ఐదు మార్గాలు ఉన్నాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఃఎ÷ూ) హాల్‌మార్క్ బంగారం నాణ్యత పరిశీలనలో అత్యంత విశ్వసనీయమైనది. బంగారం స్వచ్ఛతను ఈ మార్క్ నిర్ధారిస్తుంది. హాల్‌మార్క్‌లో క్యారెట్లలో స్వచ్ఛత, స్వర్ణకారుడి గుర్తింపు వంటి సమాచారం ఉంటుంది.హాల్‌మార్క్ ఉన్న బంగారు ఆభరణాల ప్రతి ముక్కకు ఒక ప్రత్యేకమైన హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉంటుంది. గోల్డ్ ప్రామాణికతను నిర్ధారించడంలో ఈ నంబర్ సహాయపడుతుంది. బిస్ కేర్ యాప్‌ని ఉపయోగించి ఈ నంబర్‌ను ధ్రువీకరించుకోవచ్చు. ఆభరణాల స్వచ్ఛత, రిజిస్ట్రేషన్, హాల్‌మార్కింగ్ సెంటర్ వంటి సమాచారాన్ని మీరే స్వయంగా తెలుసుకోవచ్చు. బంగారం కొనాలనుకునే వారు యాప్ స్టోర్‌లో బీఐఎస్ కేర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ సాప్ట్‌వేర్ ద్వారా హెచ్‌యూఐడీని గుర్తించవచ్చు. తద్వారా మీరు కొంటున్న బంగారం నిజమైనదా కాదా అని మీరే నిర్ధారించుకోవచ్చు. ఇందులో స్వర్ణకారుడి వివరాలతో పాటు హాల్‌మార్కింగ్ సెంటర్‌కు సంబంధించిన సమాచారం కూడా ఉంటుంది. బంగారు ఆభరణాలు వివిధ రకాల స్వచ్ఛత స్థాయిలలో ఉంటాయి. నాణ్యతను తరచుగా క్యారెట్‌లలో కొలుస్తారు. సాధారణంగా ధన త్రయోదశి సమయంలో 22 క్యారట్ల బంగారాన్ని ఎక్కువగా కొంటుంటారు. అయితే 24 క్యారెట్ల బంగారం ఎక్కువ నాణ్యత కలిగివుంటుంది. బంగారం నాణ్యతను

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ,
లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# నాగార్జున నగర్ కాలనీ నూతన కమిటీ ఏన్నిక

## అధ్యక్ష, కార్యదర్శులుగా నామాల కృష్ణ, యావపురం రవిలు

దిశ, కాప్రా





కాప్రా సర్కిల్ కుషాయిగూడ నాగార్జున నగర్ కాలనీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నామాల కృష్ణ, యావపురం రవి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగార్జున నగర్ కాలనీవెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఎన్నికల కన్వీనర్ గా వ్యవహరించిన పుప్పాల లక్ష్మీకాంతయ్య, ఎలక్షన్ ఆఫీసర్ ఎమ్ఎస్ చారి లు ఈ మేరకు ప్రకటన చేశారు. అధ్యక్షులుగా నామాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యావపురం రవి, కోశాధికారిగా బి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం కరుణాకర్ రెడ్డి, బి గోపాల్ యాదవ్, ఎం మహేందర్ గౌడ్, సహాయ కార్యదర్శులుగా ఎం శ్రీశైలం, సయ్యద్ సాదిక్, నాగరాజుగౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా సాయి వివేక్, వెంకటేష్ గౌడ్, జాంగిర్ పాష లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. అందరం సమిష్టిగా కలిసి మెలసి పనిచేసి నాగార్జున నగర్ కాలనీ ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కాలనీలో మంచి ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు బాధ్యతలు అప్పజెప్పిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి యాదవ్, నరసింగరావు, చిత్తయ్య, వెంకటేష్ ముదిరాజ్, బాల్ నరసింహ, వెంకన్న, విజయభాస్కర్, విష్ణు సాయి ప్రసాద్, సాయి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.నాగార్జున నగర్ కాలనీ అసోసియేషన్ ఎన్నికల కన్వీనర్ గా వ్యవహరించిన పుప్పాల లక్ష్మీకాంతయ్య, ఎలక్షన్ ఆఫీసర్ ఎమ్ఎస్ చారి లు ఈ మేరకు ప్రకటన చేశారు.



# అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి.

## సిపిఎం పార్టీ కాప్రాసర్కిల్ కమిటీ మూడవ మహాసభ డిమాండ్...

తెలంగాణ వీణ, కాప్రా




జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ వెంటనే ఇందిరమ్మ ఇల్లు, డబ్బులు బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి అని సిపిఎం పార్టీ కాప్రా సర్కిల్ మూడవ మహాసభ డిమాండ్ చేసింది. కాప్రా సర్కిల్ చర్లపల్లి లోని వివేకానంద నగర్ కాలనీలో కామ్రేడ్ .సీతారాం ఏచూరి నగర్ లో సిపిఎం పార్టీ కాప్రా సర్కిల్ మూడవ మహాసభ జరిగింది. మహాసభ ప్రారంభ సూచికంగా జెండా ఆవిష్కరణ సీనియర్ నాయకులు కామ్రేడ్ జి. యాదగిరి రావు గారు జండా ఆవిష్కరణచేశారు. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన తర్వాత ప్రారంభ సభ లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింగరావు గారు, ముగింపు సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య గారుపాల్గొని ప్రసంగించారు. తర్వాత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన పార్టీ కార్యక్రమాలపై కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టడం జరిగింది. కార్యదర్శి నివేదికపై మహాసభకు హాజరైన ప్రతినిధులు కూలంకశంగా చర్చించి పార్టీ అభివృద్ధి, విస్తరణ, పునాది కొరకు నిరంతరం సూచనలు చేశారు.ప్రజా సమస్యలపై పోరాటాల నిర్వహించాలని, అదేవిధంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పైన నిరంతరం పార్టీ పోరాటం చేయాలని ఆ విధంగా కార్మిక సమస్యలపై, నివాస ప్రాంత సమస్యలపై విద్యార్థి,యువత మహిళ సమస్యలపై, సాంస్కృతిక, సేవా రంగంలో బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేయాలని తద్వారా పార్టీ విస్తరణ చెందుతుందని ప్రతినిధులు తెలియజేశారు. మహాసభలో ఆరు సమస్యల పైన తీర్మానాలను మహాసభ ఆమోదించింది. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కార్మిక చట్టాలు అమలుచేయాలని, మహిళలపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలను అరికట్టటకు చట్టరీత్యా సమగ్రమైన చర్యలు తీసుకోవాలనీ. మాదకద్రవ్యాల నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని, చర్లపల్లి రైల్వే స్టేషన్ విస్తరిస్తున్నందున ఐదు ఫేస్ లను కలుపుతూ కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలనీ, మెట్రో రైలు హబ్సిగూడ,నాచారం, చర్లపల్లి, ఈసీఐఎల్ నుండి జూబ్లీ స్టేషన్ వరకు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలనీ, మహాసభ ప్రతినిధి వర్గం




ఆమోదించి ప్రజా పోరాటాల నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం పార్టీ కాప్రా సర్కిల్ నూతన కమిటీని 13 మందితో ఎన్నుకోవడం జరిగింది. కాప్రా సర్కిల్ కమిటీ నూతన కార్యదర్శిగా జి.శ్రీనివాసులు కమిటీ సభ్యులుగా సిహెచ్. వి. ప్రసాద్, జె. రాఘవరావు కే.వెంకటాచారి , పి.గణేష్ డీకే. దుర్గయ్య బి వి సత్యనారాయణ, డి.కొండల్ రెడ్డి , సఫియా సుల్తానా , కురునెల్లి వెంకటేశ్ , శివన్నారాయణ ,ఎండి.జెన్ని కో ఆప్షన్ గా ఎన్నికైనారు.

# అనిషా ఎంక్లేవే వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

తెలంగాణవీణ, కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ, 6వ వార్డ్ లోని అనిషా ఎంక్లేవే వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ కార్యవర్గం ఏర్పాటుకు కాలనీ వాసులు అందరు పాల్గొని తమ అభిప్రాయాలూ తెలియచేసారు. అనంతరం బీరం సాంబ శివ రెడ్డి నీ అనిషా ఎంక్లవే వెల్ఫేర్ అసోసియేషన్ కి ప్రెసిడెంట్ గా అందరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ విషయానికి వొస్తే అసోసియేషన్ అధ్యక్షులుగా బీరం సాంబ శివ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మువ్వా త్రినాథ్, ప్రధాన కార్యదర్శిగా బీరం రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా షేక్ మౌలానా, ఫనింద్ర, కోశాధికారిగా అరుణ్ కుమార్, ఆర్గనైజర్ యామిని గారు, సలహాదారులుగా పి. వెంకటేష్, కే.వెంకట, దిలీప్ రాథోడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షాలు బీరం సాంబ శివ రెడ్డి మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన నాకు సహకరించిన కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్దే లక్ష్యం

## చైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్

తెలంగాణవీణ , కీసర :

దమ్మాయిగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు . సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వివిధ వార్డులకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వార్డుకు రూ. 30 లక్షల చొప్పున మొత్తం రూ. 5.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానించారు . సమావేశంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, డీఈఈ బాల మురళి, టీపీఎస్ శ్రీదేవి, మేనేజర్ ఎ .వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఓయు జేఏసీ అధ్యక్షుడు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు..

తెలంగాణ వీణ/ఓయూ:

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఓయు జేఏసీ అధ్యక్షుడు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలోశ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఓయూ జేఏసీ, మాదిగ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిర్వహించారు. ఓయు జేఏసీ అధ్యక్షుడు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, అంబేద్కర్ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు రాపోలు రాములు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడానికి కీలక పాత్ర పోషించి న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.



# ఇ కళ్ళు కంపౌండ్ మాది

తెలంగాణ వీణ, అక్టోబర్ 28,కుత్బుల్లాపూర్ :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ దుండిగల్ గ్రామం లో గత వంద సంవత్సరా ల నుండి కళ్ళు కంపండ్ నడుస్తుంది.దుండిగల్ గ్రామమం గ్రామపంచాయతీ ఉన్నప్పుడు సర్పంచ్ మరియు గ్రామ గౌడ్ సంగం పెద్దలు గ్రామ పెద్దల సమక్షంలో కళ్ళు కంపౌండ్ కు గాను 350 గజాల విస్తీర్ణ తో భూమీ కేటాయించడం జరిగింది. అప్పటి నుండి దీనిపై దుండిగల్ గ్రామం గౌడ్ సంగం 250 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామపంచాయతీ,మున్సిపల్ అధికారుల వత్తిడి తో గడిచిన 20 సంవత్సరా ల నుండి పన్నులు చెల్లెస్తున్నాము. కొంతమంది ఇది చూసి ఓర్వలేక దీనిపై రాధాతం చేస్తున్నారు అని దుండిగల్ ఊరు గౌడ్ సంఘ పెద్ద లు చెప్పడం జరిగింది. ఇపుడైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కళ్ళు కంపోండ్ కి సంబంధించిన అన్ని అధికారాలు మాకు ఇపించగలరని అని కోరుతున్నారు. గౌడ్ సంఘం నాయకులు మధు గౌడ్ యాషికి ని మరియాద పూర్వకంగా కలిసి వివరంగా చెప్పడంజరిగగింది. ఇ కార్యక్రమం లో దుండిగల్ గౌడ్ సంఘం నాయకులు యల్.నర్సింగ్ గౌడ్, యల్. బిక్షపతి గౌడ్, టి. పాండు గౌడ్, బి. లింగం గౌడ్, జీ పాండురంగం గౌడ్, ఏ. శివుడు గౌడ్, యస్. కుమార్ గౌడ్, ఇ. శ్రీనివాస్ గౌడ్, బి.నర్సింగ్ గౌడ్, బి. రాజు గౌడ్, ఏ. యల్లయ్య రాజ్ గౌడ్, ఏ. శ్రీధర్ గౌడ్, యల్. అరుణ్ గౌడ్ మరియు ఊరి పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




# నేడు వరల్డ్ స్ట్రోక్ డేపై అవగాహన ర్యాలీ

తెలంగాణవీణ ,కాప్రా :

ఈసీఐఎల్ చౌరస్తాలోని లైఫెలైన్ తులసి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు వరల్డ్ స్ట్రోక్ డే అవగహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు . తులసి ఆసుపత్రిని లైఫెలైన్ తులసి ఆసుపత్రిగా మార్చనట్లు తెలిపారు . ఈ ఆసుపత్రి నందు అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని , ఎమర్జెన్సీ మ 85 పడకలతో కూడిన ఐసీయూ విభాగాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు .



# తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పాదయాత్ర

**తెలంగాణ వీణ/ఓయూ:**

తెలంగాణ కల సాకారం చేసుకునేందుకు జరిగిన నాటి పోరాటంలో సకల జనుల పాత్ర మరువలేనిది. ఉద్యమంలో ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారు. అరెస్టులు, లాఠీ చార్జీలు, దాడులు, జైలు జీవితాలు అన్నిం టిని ఎదిరించి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం సాధించు కున్నాము. ఫలితంగా 10 సంవత్స రాల పాటు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పరిపాలించింది. అందరికీ న్యాయం చేస్తాడని నమ్ముకోవడం, ఉద్యమ కారుల సహకారం వల్లనే రెండుసార్లు అధి కారం చేపట్టగలిగింది కేసీఆర్ ప్రభుత్వం. కెసిఆర్ కుటుంబ పాలనలో ఉద్యమ కారులు గౌరవ, మర్యాద లకు గానీ కనీసం ఎలాంటి గుర్తింపుకు నోచుకోలేదు. ప్రశ్నిం చిన వారిని నిలదీసిన వారిని, నిర్బం ధించి నిండా ముంచిన ఘనత కెసిఆర్ కు దక్కింది. ప్రత్యేక తెలంగాణ ఇస్తే కాంగ్రెస్ కి మద్దతిస్తామని కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీని నమ్మించి మోసగించిన ఘనుడు కెసిఆర్. తెలంగాణ ఇస్తే ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తమవుతున్నా తెలంగాణ కోసం జరుగుతున్న విద్యార్థి, యువత ఆత్మ బలిదానాలకు చలించి సోనియా గాంధీ నాడు తెలంగాణ ప్రకటిం చారు. కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీ ల సాక్షిగా జరిగిన ఉద్యమాన్ని తన స్వయం కృషిగా చెప్పుకుంటున్న కెసిఆర్ కుట్రలను బొంద పెట్టాల్సిన బాధ్యత ఉద్యమకారులదే. ఏ దిక్కు లేక మనసులో ఉద్యమ త్యాగం నెమరు వేసుకుంటూ కుమిలిపోతున్న తెలంగాణ ఉద్యమకారులకు సముచిత



స్థానం కల్పిస్తామని తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రకటిం చింది. ఈ సందర్భంలో తెలంగాణ లోని ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి వచ్చి హక్కుల సాధనకు పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యం లోనే ఈ నెల 15 నుండి 29 వరకు ఆదిలాబాద్ నుండి ఆర్ట్స్ కళాశాల వరకు పాదయాత్ర చేపడుతున్నాము. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోపే ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరిస్తే ఉద్యమకారులంతా కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయిలో మద్దతు తెలియజేస్తారని హామీ ఇస్తున్నాము. తాము చేస్తున్న న్యాయ బద్ధ మైన మా కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సహకరిం చాలని కోరుతున్నాం.అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ కూడా హామీ ఇచ్చిన ఇంకా జాప్యం చేయకుండా మా హామీ నెరవేర్చాలని ఒకవేళ కాంగ్రెస్ పార్టీ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రానున్న లోకల్ ఎలక్షన్ లో అన్ని కార్పొరేషన్లలో అదేవిధంగా అన్ని జిల్లాలలో మండల స్థాయి గ్రామస్థాయి ఎలక్షన్లలో పోటీ చేయడానికి సంసిద్ధం చేస్తామని ఆ విధంగా కార్యచరణ రూపొందిస్తామని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి శ్రీశైలం అన్నారు ఈరోజు ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ చేరుకున్న ఉద్యమకారుల పాదయాత్ర రేపు 29వ తారీకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించాలని సంకల్పించినారు కానీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల 30 యాక్టివ్ 144 సెక్షన్ అమల్లో ఉండడంవల్ల విరమించుకోవడం జరిగింది కానీ ఉద్యమకారులందరూ ఏకమయ్యే వరకు మా పోరాటం ఆగదని ఉద్యమ కళాకారులు కూడా రానున్న లోకల్ ఎలక్షన్లు ఏ రాజకీయ పార్టీకి డబ్బులు కొట్టకుండా పాటలు పడకుండా నిరసన వ్యక్తం చేస్తారని ఆ విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలియజేస్తా ఉన్నాం తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ ఉద్యమ కళాకారులను తెలంగాణ అమరవీరులను తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్ పెందూరు మారుతి శివన్న ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జాహిద్ మామిడి లక్ష్మణ్ శ్యాంసుందర్ పాలకొండ దత్తు ఆత్రం వినోద్ దాసరి విలాస్ దుర్గం జగదీశ్వర్ పాల్గొన్నారు.

## షాపూర్ నగర్ లో ఉచిత మెడికల్ క్యాంపు

### -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్

**తెలంగాణ వీణ::: కుత్బుల్లాపూర్**

షాపూర్ నగర్ అడ్డమీది కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా, బిపి, షుగర్, కిడ్నీ, లివర్, లాంటి పదహారు రకాల చికిత్స పరీక్షలు చేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రవిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడుకి హెల్త్ కార్డ్స్ చేయించడం జరిగింది.. అలాగే ఆరు నెలలకు ఒకసారి చెక్ చేయించుకోవాలని ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని బీపీ, షుగర్, ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ప్రతి ఒక్క కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలని ఉచిత వైద్య శిబిరం కార్యక్రమం పెట్టడం జరిగిందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రెటరీలు, కోశాధికారులు, ఆర్గనైజర్స్, అడ్వైజర్స్, మరియు కమిటీ సభ్యులు, మహిళలు, వృద్ధురాలు, వితంతువులు, వికలాంగులు, అదేవిధంగా అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొనడం జరిగిందని అలాగే నిత్యం కార్మికులతోనే ఉంటూ భవన నిర్మాణ కార్మికులు ఏలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ఆరోగ్యంగా ఉండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని తెలిపారు.. ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొన్న లేబర్ ఆఫీస్ డాక్టర్లకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు..



## అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధుకర్ రాజ్ చేసిన సేవలు మరువలేనివి

### ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం

**తెలంగాణ వీణ/ఓయూ:**

ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధుకర్ రాజ్ చేసిన సేవలు మరువలేనివని ఓయూ వీసీ ప్రొ, కుమార్ మొలుగారం పేర్కొన్నారు. ఎన్జీవోస్ స్టాఫ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై. మధుకర్ రాజ్ పదవీ విరమణ సందర్భంగా ఓ.యూ నాన్ టీచింగ్ హోంలో అభినందన సభను నిర్వహించి మధుకర్ రాజ్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి వీసీ కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ బి. లక్ష్మినారాయణ హాజరై మధుకర్రాజ్ను సత్కరించారు. అదేవిధంగా గౌరవ అధితిగా మాజీ వీసీ సిహెచ్.గోపాల్రెడ్డి పాల్గొన్నారు. టీజీజేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, తుంతియా, ఎన్జీవోస్ అధ్యక్షులు బియాని జ్ఞానేశ్వర్ పాల్గొని మధుకర్ రాజ్ -యూకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ యూనియన్ నాయకులు భీమయ్య, జి.శంకరయ్య, అశోక్ కుమార్, భూమారావు, కంకరయ్య, యూసుఫ్ పాష, రాజేష్, కె.రవి, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శివశంకర్, ప్రధాన కార్యదర్శి అక్బర్ బేగ్, టెక్నికల్ స్టాఫ్ అధ్యక్షులు నాగరాజారావు, ప్రధాన మాద్యదన్ని విజయకుమార్తో పాటు పలువురు యూనియన్ నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.




## దీర్ఘకాలిక సమస్యలపై ఆర్టీసీ ఉద్యమ కార్యాచరణ విజయవంతం కోసం డిపోల పర్యటన

**తెలంగాణ వీణ, హైదరాబాద్**

ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ విజయవంతా నికై జేఏసీ డిపోల పర్యటనలో భాగంగా సోమవారం రాణిగంజ్ డిపో, చేంజ్ ఓవర్ కంటోన్మెంట్ డిపో పీకెట్ డిపో జేబీఎస్, గ్రేటర్ హైదరాబాద్ ఆడిట్ సెక్షన్ లో జేఏసీ పర్యటించడం జరిగింది రాబోయే రోజులలో గ్రేటర్ హైదరాబాదులోని అన్ని డిపోల్లో విజిట్ చేస్తామని జేఏసీ ప్రకటించడం జరిగింది. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన రాబోయే రోజులలో పోరాటం ఉదృతం చేయడానికి జేఏసీ నిర్ణయం చేసింది.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ముందు ఉందని తెలుపుతూ కార్మికులను చైతన్య%శీ% చేస్తున్నట్టుగా జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రచారం చేయడం జరుగుతుందన్నారు.




## త్వరలో నాచారం ఓల్డ్ విలేజ్ లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

### -కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్...

**తెలంగాణవీణ , నాచారం :**

నాచారంలో రోడ్డు నిర్మాణానికి 54 లక్షల రూపాయలు మంజూరు చేయించినందుకు నాచారం గ్రామ పెద్దలు భూపాల్ రెడ్డి, సాయిబాబా, యాదగిరి గౌడ్, భరత్, ప్రశాంత్ తదితరులు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ కి కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాచారం ఓల్డ్ విలేజ్ లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల కొరకు 30 లక్షల 50 వేల రూపాయలు నిధులు మూడు సంవత్సరాల క్రితం మంజూరయ్యాయి దీనికి సంబంధించి శిలాఫలకం కూడా ఏర్పాటు చేయడం జరిగింది.కానీ నాచారం ఓల్డ్ విలేజ్లో భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.సుమారు కోటి రూపాయల నిధులతో నాచారం ఓల్డ్ విలేజ్లో పూర్తిగా భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు.రోడ్డు పనులకు వచ్చిన 30 లక్షల 50 వేల రూపాయల నిధులు రిటర్న్ వెళ్లిపోయాయని అధికారులు చెప్పడంతో కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే జోనల్ కమిషనర్ ను కలిసి మాకు గతంలో మంజూరైన 30 లక్షల 50 వేల రూపాయలు క్యాన్సిల్ అయ్యాయి దానికి బదులుగా పూర్తి నాచారం ఓల్డ్ విలేజ్లో 54 లక్షల రూపాయల కొత్త నిధులు శాంక్షన్ చేయాలని ఎమ్మెల్యేని,జోనల్ కమిషనర్ ని కోరడంతో అక్టోబర్ 2వ తారీఖున 54 లక్షల రూపాయలకు మంజూరు చేయించారు.టెండర్ దక్కించుకున్న వ్యక్తికి తొందర్లోనే అగ్రిమెంట్ చేసి పనులు ప్రారంభించాలని కార్పొరేటర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**తెలంగాణా వీణా హైదారాబాద్**

నిజామాబాద్ రూరల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ కొట్టాల రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారనీ వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.సహకార సంఘం అధ్యక్షులు కొట్టల రవీందర్ మాట్లాడుతూ ఎంతో మంది రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని.ఇలా మోసాలకు గురి కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబెట్టి విక్రయించాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ రెడ్డి.సొసైటీ డైరెక్టర్ లు. సి ఈ వో. రైతులు పాల్గొన్నారు.




## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

### కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్.

**తెలంగాణ వీణ,, మల్కాజ్గిరి..**

డివిజన్లో అన్ని కాలనీల అభివృద్ధి కోసం కృషి చేస్తానని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం మౌలాలి డివిజన్ పరిధిలో నిెహ్రూ నగర్లో 30 లక్షలు 10 లక్షల తో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సునీత యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మౌలాలి డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లికార్జున ,సెక్రటరీ సుధాకర్, ఎల్లం ఆంజనేయులు, నరసింహాచారి ,కృష్ణ, దినేష్, శ్రీనివాస్ యాదవ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు



GS9 TV తెలుగు

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న

GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు

అన్నీ జిల్లాల నుండె విలేకరులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

8328209811
9703024024

## నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ప్రారంభించిన డిసిపి పద్మజా

**తెలంగాణ వీణ, మల్కాజ్గిరి.**

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ నందు రక్తదాన శిబిరం మెడికల్ క్యాంపు లయన్స్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ సన్ సీడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి డిసిపి పి.వి పద్మజ, కుషాయిగూడ ఏసిపి మహేష్ కుమార్ గౌడ్, , నేరేడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్, నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ సిబ్బందిలి పాల్గొన్నారు.. లైన్స్ క్లబ్ తరపున నుండి లయన్ సురేష్ కుమార్ , లయన్ జ్యోతిర్మాయ చారి , లయన్స్ క్లబ్ ఇతర సభ్యులు , డెంటల్ డాక్టర్ హేమత్ అతని సిబ్బంది, సన్ సీడ్ హాస్పిటల్ డాక్టర్ అన్వేష్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు

## సోమ వారం ఏకాదశి ప్రత్యేక పూజలు

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**

యాదగిరి గుట్ట కొండ పైన పర్వత వర్ధిని రామ లింగేశ్వర స్వామి వారి కి ఏకాదశి సోమవారం సందర్భంగా స్వామి వారికి రుద్రాబిషేకం మరియు ప్రత్యేక పూజలు వేద మంత్రాల తో స్వామి వారిని సేవించుకున్నారు



# వచ్చే ఏడాది నుంచి జనాభా లెక్కలు షురూ

## 2026 కొనసాగనున్న ప్రక్రియ

## చివరిసారిగా 2011లో లెక్కలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ) :**

దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ 2025లో ప్రారంభం అవుతుందని సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఇది 2026 వరకూ కొనసాగనున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ అనంతరం లోక్‌సభ స్థానాల విభజన ప్రక్రియ ఉంటుందని తెలిపాయి. అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026లో ప్రభుత్వం గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ప్రధానమంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్టు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్న విషయం తెలిసిందే. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్–82, ఆర్టికల్–170 ల ప్రకారం దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ సరిహద్దులను నిర్ణయించాలి. ఆ తర్వాత రిజర్వేషన్లు మారుస్తూ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఒక చట్టబద్ధ సంస్థ. దేశంలో అన్ని ప్రాంతాలకు, కులాలకు సమన్యాయం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. కానీ గడచిన 50 ఏండ్లుగా నియోజకవర్గాల విభజన జరగలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఇక చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. ఆ తర్వాత 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దేశంలో ఇప్పటి వరకు 1952, 1963, 1973, 2002లలో నాలుగుసార్లు నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. ఇప్పుడు మనకున్న నియోజకవర్గాల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973 లో నిర్ణయించడం జరిగింది. దేశంలో జనాభా పెరుగుదల ప్రమాదకరంగా మారిందని భావించి జనాభా నియంత్రణ జరగాలనే ఉద్దేశంతో 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి ఈ ప్రక్రియను 2001 వరకు నిలిపివేయడం జరిగింది. 2002లో పునర్విభజన జరపాలని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని దక్షిణానికి చెందిన భాగస్వామ్య పార్టీలు అడ్డుకోవడం జరిగింది. ఫలితంగా 2026 వరకు నిషేధాన్ని పొడిగించారు.



# ఆర్మీ వాహనంపై ఉగ్రవాదుల దాడి

## ఉగ్రవాది హతం

**శ్రీనగర్, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ) :**

జమ్ము కశ్మీర్‌లో వరుస ఉగ్రదాడి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే కాలంలో ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. ఎక్కడో ఒకచోట భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడుతున్నారు. తాజాగా అఖ్నూర్ సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం కలకలం సృష్టించింది. ఆర్మీ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. అఖ్నూర్ సెక్టార్ ప్రాంతంలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆర్మీ వాహనంపై పలు రౌండ్లు కాల్పులు జరిపిన ఉగ్రవాదులు అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ఉగ్రవాదుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాదిని ఆర్మీ మట్టుబెట్టినట్లు తెలిసింది. దీపావళి సందర్భంగా జమ్ము ప్రాంతంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు జరుగుతోన్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కాగా, జమ్ముకశ్మీర్ అంతటా.. ముఖ్యంగా లోయలో గత వారంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు సహా కనీసం 12 మంది మరణించారు. అక్టోబర్ 24న, బారాముల్లాలోని గుల్‌మార్గ్ సమీపంలో ఉగ్రవాదులు ఆర్మీ వాహనంపై మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఇద్దరు సైనికులు, ఆర్మీలో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు మరణించారు. అంతేకాకుండా గాందర్‌బల్ జిల్లాలో సోన్‌మార్గ్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఓ వైద్యుడు, ఐదుగురు వలస కార్మికులు మృతి చెందారు.

# రాజ్‌పాకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రుజువులు

## బామ్మర్ది తప్పు చేస్తే వెనకేసుకు వస్తారా

## జన్వాడ ఫామ్‌హౌస్ వ్యవహారంపై కెటిఆర్ సమాధానం ఇవ్వాలి

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఘాటు విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

రాజ్ పాకాల పామ్ హౌస్‌లో డ్రగ్స్ వాడినట్లు పెద్ద అభియోగం ఉందని.. కేటీఆర్ దానికి సమాధానం చెప్పాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. బామ్మర్ది తప్పు చేస్తే పోలీసులకు సహకరించకుండా కెటిఆర్ ఎదురుదాడి చేస్తున్నాడని మండిపడ్డారు. జన్వాడ ఫామ్ హౌస్ వ్యవహారంపై సమాధానం చెప్పాలని అన్నారు. తాజాగా ఈ అంశంపై స్పందించిన మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కేటీఆర్ పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బామ్మర్ది తప్పుచేస్తే కేటీఆర్ వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయొద్దని.. బామ్మర్ది తప్పును వెనుకేసుకొస్తే కేటీఆర్ రాజకీయంగా సమాధి కాక తప్పదని అన్నారు. తప్పు చేయక పోతే హోస్ట్ రాజ్ పాకాల ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు. జన్వాడ పామ్ హౌస్ లో స్టింగ్ ఆపరేషన్ జరగలేదని.. కేవలం పిర్యాదు మేరకే పోలీసులు దాడి చేశారని స్పష్టం చేశారు. రాజ్ పాకాల గతంలో జూబ్లీ హిల్స్ లో హై లైఫ్ పబ్ ను నడిపాడని..ఆ పబ్ లో రాజ్ పాకాల డ్రగ్స్ నడిపాడని అందరికీ తెలుసని అన్నారు. ఓనర్ రాజ్ పాకాల లేకుండా ఇంట్లో దావత్ చేస్తారా అని ప్రశ్నించారు. రాజ్ పాకాల క్లోజ్ ఫ్రెండ్ విజయ్ మద్దూరి డ్రగ్స్ తీసుకొని అడ్డంగా దొరికిపోయాడని అన్నారు. రాజ్ పాకాల పోలీసుల ఎదుట జరిగిన విషయం చెప్పకపోతే అందరూ డ్రగ్స్ వాడినట్లు ప్రజలు భావిస్తారని అన్నారు. రాజ్ పాకాల 111 జీవోలో ఇల్లు ఎలా కట్టుకున్నారని ప్రశ్నించారు. 9 ఏండ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కు లిక్కర్ కు పర్మిషన్ తీసుకోవాలని తెలియదా అని ప్రశ్నించారు. గృహ ప్రవేశం చేసి దావతలు చేసుకోవడం తెలంగాణలో కొత్తేమికాదని.. తెలంగాణలో రూల్ ఆఫ్ లా వచ్చింది కాబట్టి ఇప్పుడు ఇవన్నీ బయట పడుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విచ్చల విడిగా ఎక్కడ పడితే అక్కడ మద్యం,డ్రగ్స్ ఏరులై పారిందని అన్నారు. 16 విదేశీ మద్యం బాటిళ్లతో రాజ్ పాకాల అడ్డంగా దొరికి పోయారని.. 6.5 లీటర్ల కంటే ఎక్కువ మద్యం ఉంటే ఎక్సైజ్ పరిమిషన్ తీసుకోవాలని కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఎక్సైజ్ డిపా÷–టం÷–మెంట్ కు సెర్చ్ చేయడానికి వారెంట్ అవసరం లేదని చట్టం చెప్తుందని.. అది తెలియక కేటీఆర్ నవ్వుల పాలు అవుతున్నారని ఎద్దేవా చేశారు. త్వరలో జడ్జిలతో జరిగే విచారణలో కాళేశ్వరం స్కామ్,ఫోన్ ట్యాపింగ్,భూదాన్ స్కామ్ లు బయటకు వస్తాయని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కి చట్టాలపై కనీస అవగాహన లేదని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బావమరిదిని కాపాడుకోవడం కోసం కేటీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రేవ్ పార్టీ జరిగిందని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. మీడియాలో కథనాలు మాత్రమే వచ్చాయని గుర్తించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరుండి ప్రచారం చేయించినట్లు ప్రతిపక్ష నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారు. మీ ప్రభుత్వం గతంలో చేసినట్లుగా ఫామ్‌హౌస్‌లో స్టింగ్, కోవర్ట్ ఆపరేషన్లు ఇప్పుడు జరగలేదు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో ఎలాంటి స్టింగ్ ఆపరేషన్ చేయలేదు. జూబ్లీహిల్స్ హై లైఫ్ పబ్‌కు రాజ్ పాకాల గతంలో యజమానిగా ఉన్నారు. డ్రగ్స్ తీసుకున్న జూబ్లీహిల్స్ గ్యాంగ్‌లో రాజ్ పాకాల సభ్యుడనే ప్రచారం కూడా జరిగింది. గత ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్‌లో పబ్‌లకు అనుమతులు ఇప్పించింది రాజ్ పాకాలనే. డ్రగ్స్‌కు స్వర్గం అని చేప్పే సన్‌బర్న్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడానికి రాజ్ పాకాల ప్రయత్నించారు. జన్వాడ ఫామ్‌హౌజ్‌లో జరిగిన పార్టీకి సంబధించి రాజ్ పాకాల మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చి ఉంటే అనుమానాలు వచ్చేవి కావు. డ్రగ్స్ తీసుకోలేదని రాజ్ పాకాల నిరూపించుకోవాలి. రాజ్ పాకాల వెంటనే పోలీసులకు లొంగిపోయి వివరణ ఇవ్వాలి. తనకు రాజ్ పాకాలనే కొకైన్ ఇచ్చాడని విజయ్ మద్దూరి పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చాడు.. ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన విషయం అని అన్నారు.



# ఆగని బెటాలియన్ పోలీసుల నిరసన

## సచివాలయముట్టడికి యత్నం పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

రాష్ట్రమంతటా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలంటూ నిరసన తెలుపుతున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లను సచివాలయ ముట్టడికి యత్నించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నగరానికి వచ్చిన బెటాలియన్ కానిస్టేబుళ్లు సోమవారం ఉదయం సచివాలయం వద్దకు బయలుదేరారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ వస్తున్న వారిని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు తమ ఆవేదనను వెళ్లగక్కారు. సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ జితేందర్ తమను పిలిచి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డే ఏక్ పోలీస్‌చేస్తానని వందసార్లు చెప్పాడని ఓ బెటాలియన్ కానిస్టేబుల్ గుర్తుచేశారు. కానీ ఇప్పుడు తమను కనీసం కలవడం లేదని అన్నారు. ఒక రివ్యూ మీటింగ్ పెట్టి మా సమస్యను తీర్చే సమయం కూడా లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన చేతగాక అన్ని వ్యవస్థలను నాశనం చేస్తూ.. న్యాయం చేయాలని అడిగిన వారిని అరెస్టులు చేయించడమేనా ప్రజా పాలన అని నిలదీశారు. తమ సమస్యలను తీర్చాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు కొద్దిరోజులుగా చేస్తున్న ఆందోళనలు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే శనివారం భార్యాపిల్లలతో రో÷–డడెక్కిన కానిస్టేబుళ్లపై తెలంగాణ పోలీసు శాఖ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెటాలియన్లలో ఒకే రోజు 39 మందిని సస్పెన్షన్ చేస్తూ అర్ధరాత్రి వేళ ఉత్తర్వులు ఇచ్చింది. తమ సహోద్యోగులు సస్పెన్షన్ గురికావడంతో వారికి బెటాలియన్ కానిస్టేబుళ్లంతా బాసటగా నిలిచారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని బెటాలియన్ల ముట్టడి చేపట్టారు. గంటలకొద్దీ బెటాలియన్ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టినా.. కమాండెంట్ పట్టించుకోకపోవడంతో పట్టరాని కోపంతో రో÷–డడెక్కారు. అనంతరం రాత్రి వేళ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అయినప్పటికీ సర్కారులో చలనం రాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ ప్రకారం సోమవారం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సెక్రటేరియట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. సచివాలయం చుట్టూ భారీగా పోలీసులను మోహరించారు. పరిపాలన సౌధం చుట్టూ 163 సెక్షన్ విధించారు. సెక్రటేరియట్ పార్కింగ్ గ్రౌండ్‌లో సుమారు 200 మంది సిబ్బందిని మోహరించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసు వాహనాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. కాగా, వీడియోలు తీయడానికి మీడియాకు అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు.

# రాజ్ పాకాలకు పోలీసుల నోటీసులు

## విచారణకు రావాలని ఆదేశాలు

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

ఫాంహౌస్‌లో పార్టీ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బీఎన్‌ఎస్‌ఎస్ 35(3) సెక్షన్ ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు మోకిల పోలీసులు తెలిపారు. పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని.. నేడు విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. అడ్రస్ ప్రూఫ్, కేసుకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సూచించారు. విచారణకు రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీసులకు అందుబాటులోకి రాకపోవడంతో మోకిల ఇన్‌స్పెక్టర్ పేరుతో ఉన్న నోటీసులను రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో రాజ్ పాకాల నివాసానికి అతికించారు. పోలీసుల నోటీసుల నేపథ్యంలో హైకోర్టును రాజ్ పాకాల ఆశ్రయించారు. అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన కోరారు.






# లాభాల్లో మార్కెట్ సూచీలు

## సానుకూల సంకేతాలతో కొనుగోళ్ల మద్దతు

**ముంబయి,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో కొనసాగాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా గత కొన్ని రోజులుగా వరుస నష్టాలు చవిచూస్తున్న సూచీలు.. సోమవారం తిరిగి పుంజుకున్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణిస్తున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఓ దశలో 1100 పాయింట్లు, నిఫ్టీ దాదాపు 300 పాయింట్ల మేర లాభపడడం గమనార్హం. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి సెన్సెక్స్ 909 పాయింట్ల లాభంతో 80,311.44 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ సైతం 234.75 పాయింట్ల లాభంతో 24,415.55 వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్‌లో ఐసీఐసీఐ బ్యాంక్‌తో పాటు మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో కొనసాగు తున్నాయి. టెక్ మహీంద్రా, కోటక్ బ్యాంక్, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మాత్రం నష్టాల్లో కొనసాగుతున్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.5.7 లక్షల కోట్లు పెరిగి రూ.442.66 లక్షల కోట్లకు చేరింది. స్టాక్‌మార్కెట్ సూచీలు ఇటీవల వరుస నష్టాలు చవిచూశాయి. నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటే జీవనకాల గరిష్ఠాల నుంచి దాదాపు 8 శాతం మేర కుంగింది. ఇదే అవకాశంగా భావించి మదుపర్లు కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు జరపడం నేటి ర్యాలీకి కారణంగా అనలిస్టులు.విశ్లేషిస్తున్నారు .ఆసియా మార్కెట్లు లాభాల్లో ప్రారంభమవడంతో దేశీయ మార్కెట్ సూచీలు అదే బాటలో పయనిస్తున్నాయి. జపాన్ నిక్కీ భారీ లాభాల్లో కొనసాగుతుండగా.. ఆస్ట్రేలియా, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లూ పాజిటివ్‌గా కదలాడుతున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడమూ మరో కారణం. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసినప్పటికీ.. చమురు, న్యూక్లియర్ వంటి వాటి జోలికిపోకపోవడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన కొంతమేర తగ్గింది. దీంతో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ సోమవారం 3 డాలర్ల మేర క్షీణించి 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇది మన మార్కెట్లకు పాజిటివ్ అంశంగా మారింది.

# మీ బామ్మర్ది పార్టీలో అమ్మాయిలు ఎవరు

## వారి వివరాలు వెంటనే ప్రకటించండి- తప్పు చేసినా ఇంకా బుకాయింపా

### కెటిఆర్ తీరుపై షబ్బీర్ అలీ మండిపాటు

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

మీ బామ్మర్ది ఫామ్ హౌస్‌లో దొరికిన డ్రగ్స్, లిక్కర్, అమ్మాయిలు, అబ్బాయిల వివరాలు అన్ని బయటపెట్టాలని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. జన్వాడలో కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్ హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ ఘటనపై షబ్బీర్ అలీ స్పందించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... అడ్డంగా దొరికి కూడా బుకాయించడానికి సిగ్గు, శరం ఉందా కేటీఆర్ అంటూ ఘాటు విమర్శలు చేశారు. ముందుగా కేటీఆర్ నార్కో టెస్ట్ చేయించుకోవాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. ప్రతి వారం కేటీఆర్ బామ్మర్ది రేవ్ పార్టీ పెడుతున్నారని పోలీసులకు సమాచారం ఉందని.. పక్కా ఇన్ఫర్మేషన్‌తోనే పోలీసులు దాడి చేశారని తెలిపారు. గతంలో జన్వాడ ఫామ్ హౌస్‌కు నాకు సంబంధం లేదు అన్నావ్.. హైడ్రా ఎపిసోడ్‌తో నా దోస్త్ ఫామ్ హౌస్ అన్నావ్.. ఇప్పుడేమో మా బామ్మర్ది ఇల్లు అంటున్నావ్.. కేటీఆర్ నోరు తెరిస్తే అబద్దాలేనని విమర్శించారు. పార్టీలో లీటర్ లిక్కర్, 6 బీర్లు మాత్రమే ఉండాలని ఎక్సైజ్ నిబంధనలు ఉన్నాయి. కానీ ఆ పార్టీలో పెద్ద ఎత్తున మద్యం పట్టుబడిందని అన్నారు. చట్టం తెలిసిన వ్యక్తులే తప్పులు చేస్తే పోలీసులు కేసులు పెట్టక పోతే ఏం చేస్తారని నిలదీశారు. జన్వాడ ఫామ్ హౌస్ ఘటనపై త్వరలో వాస్తవాలు అన్ని ప్రజల ముందు పెడతామని స్పష్టం చేశారు. గతంలో జన్వాడ ఫామ్ హౌస్‌పై డ్రోన్ ఎగరేసి వాస్తవాలు బయటపెట్టినందుకు చిన్ని పిట్టి కేసులో ఆ రోజు ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. అండర్ ట్రయల్ ముద్దాయిగా జైల్లో పెట్టి రేవంత్ రెడ్డిని చంపాలని చూశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆనాడు జైల్లో రేవంత్ రెడ్డి హత్యకు కుట్ర చేస్తే.. ప్రజల అతడిని ముఖ్యమంత్రిని చేశారన్నారు. కేటీఆర్ హవాయి చెప్పల్ నుండి హవాయి జహజ్ వరకు ఎదిగారు. ఈ ఆస్తులన్నీ ఎక్కడి నుండి వచ్చాయో ఆయన ఆస్తులపై ప్రభుత్వం విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసు విచారణలు అన్ని సీఎం క్యాంప్ ఆఫీసులో జరిగాయి.. కేసీఆర్ ఏమైనా జడ్జా అని ప్రశ్నించారు.

# రాజ్ పాకాలకు రెండ్రోజుల సమయం ఇవ్వండి

**జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో హైకోర్టులో విచారణ**

**విచారణకు హాజరు కాని విజయ్ మద్దూరి**

**తన ఫోన్ బదులు మరొకరి ఫోన్ ఇచ్చిన విజయ్**

**కేటీఆర్ సతీమణిని విచారించిన పోలీసులు**

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

జన్వాడ ఫామ్ హౌస్ కేసుకు సంబంధించి కేటీఆర్ బామ్మర్ది రాజ్‌పాకాల దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విచారణకు హాజరయ్యేందుకు రాజ్‌పాకాలకు 2 రోజుల సమయం ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. జన్వాడ ఫామ్ కేసు విచారణలో ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసుల తరఫున ఏఏజీ కోర్టుకు తెలపగా.. నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లాలని న్యాయస్థానం సూచించింది.కాగా, తెలంగాణలో సంచలనం సృష్టించిన జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని పోలీసులు ఈ కేసులో ఏ1, ఏ2 నిందితులుగా చేర్చారు. ఈ క్రమంలో జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని.. తనను అరెస్ట్ చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టులో రాజ్ పాకాల లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పోలీసుల ముందు హాజరయ్యేందుకు రాజ్ పాకాలకు రెండు రోజుల సమయం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, జన్వాడ్ ఫామ్ కేసులో కీలక నిందితుడైన రాజ్ పాకాల నివాసం ఓరియన్ విల్లాలో ఆదివారం పోలీసులు సోదాలు చేశారు. అనంతరం పరారీలో ఉన్న రాజ్ పాకాలకు విచారణకు హాజరు కావాలంటూ ఆయన నివాసానికి నోటీసులు అంటించి వెళ్లారు. ఈ క్రమంలోనే రాజ్ పాకాల న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇదిలావుంటే జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఫామ్ హౌస్‌లో పార్టీకి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సతీమణిని పోలీసులు విచారించారు. మరోవైపు.. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న విజయ్ మద్దూరి పోలీసుల దర్యాప్తుకు సహకరించ లేదు. ఆదివారం విచారణకు హాజరైన విజయ్ మద్దూరి.. సోమవారం పోలీసుల దర్యాప్తుకు డుమ్మా కొట్టాడు. జన్వాడ ఫామ్ హౌస్‌లో రైడ్ సమయంలో తన మొబైల్ దాచిపెట్టి మరో మహిళ మొబైల్‌ను విజయ్ మద్దూరి తమకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. తన మొబైల్ దొరికితే డ్రగ్స్ లింక్స్ బయటపడతాయన్న భయంతోనే విజయ మద్దూరి వేరే మహిళ ఫోన్ అందజేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దాడుల సమయంలో విజయ్ మద్దూరి సతీమణి ఆయన పక్కనే ఉండగా.. తన సతీమణి నెంబర్ కాకుండా థర్డ్ పర్సన్ నెంబర్‌ను ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో డబ్బులు కాకుండా కాయిన్స్ రూపంలో పేకాట ఆడినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తులో పేకాట ఆడినట్లు తేలితే మరో కేసు నమోదు చేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల సమయంలో పోలీసుల కంటపడకుండా కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాలా పరార్ అయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో రాజ్ పాకాలా, విజయ మద్దూరి నోరు మెదిపితే కేసు దర్యాప్తు ముందుకు సాగుతోందంటున్నారు.

# యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రంలో లక్ష పుష్పార్చన వేడుకలు..

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**

యాదాద్రి లక్ష్మీ నృసింహ స్వామి సన్నిధిలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ రకాల పువ్వులతో లక్ష పుష్పార్చన ఆలయ అర్చకులు వైభవంగా పూజలు నిర్వహించారు.. భక్తి శ్రద్ధలతో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు..

# దీపావళికి ముందే గాలిలో తగ్గిన నాణ్యత

## వ్యర్థాల దహనాలతో పెరిగిన కాలుష్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ) :**

దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357 గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. కాగా, ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే.

# ఈ యాప్‌తో రహస్య కెమెరాలకు చెక్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (తెలంగాణ వీణ) :**

బెడ్రూం కార్యకలాపాలు ఇటీవల సోషల్ మీడియాకెక్కి పరువును గంగపాలు చేస్తున్నాయి. ఈ ప్రైవేటు కార్యం రహస్య కెమెరాలకు చిక్కడంతో బోల్డన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో మధురంగా ఉండాల్సిన ఏకాంత క్షణాలు చేదు గుళికలుగా మారిపోతున్నాయి. అయితే, ఇకపై ఎలాంటి బెరుకు లేకుండా, తమను ఫొటోలు, వీడియోలు తీస్తారన్న భయం లేకుండా నిశ్చింతగా ఆ మధుర క్షణాలను ఆస్వాదించవచ్చు. ఇందుకోసం జర్మన్ సెక్సువల్ హెల్త్ బ్రాండ్ 'బిల్లీ బాయ్' సరికొత్త యాప్‌ను ఆవిష్కరించింది. కమ్‌డోమ్"గా పిలిచే ఈ యాప్ 'డిజిటల్ కండోమ్"గా వ్యవహరిస్తుంది. ఏకాంతంలో ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్లలోని కెమెరాలు, మైక్రోఫోన్లు పనిచేయకుండా ఈ యాప్ అడ్డుకుంటుంది. ఇకపై ఏకాంతంలో మనకు తెలియకుండా ఆ సీన్లను వీడియోలు, ఫొటోలు తీయడం, ఆడియోను రికార్డు చేయడం జరగదని బిల్లీబాయ్ పేర్కొంది. ఈ యాప్‌ను 30 దేశాల్లో విడుదల చేశారు. ఇది బ్లూటూత్ సాంకేతికతతో సమీపంలోని స్మార్ట్‌ఫోన్లను నిర్వీర్యం చేసి ఏకాంతాన్ని ఆహ్లాదంగా మారుస్తుంది. ఎవరైనా వీడియోలు, ఫొటోలు తీయాలనుకున్నా కమ్‌డోమ్ యాప్ వెంటనే రియాక్ట్ అవుతుంది. అలారం మోగి యూజర్లను అప్రమత్తం చేస్తుంది.




# భువనగిరిలో రిమాండ్ ఖైదీ పరార్ ?

**యాదాద్రి భువనగిరి,అక్టోబర్28(తెలంగాణ వీణ):**

భువనగిరి సబ్ జైలు రిమాండ్ ఖైదీ భువనగిరి ప్రభుత్వ హాస్పిటల్ నుంచి పరారయ్యాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 17వ తేదీన భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫోక్సో కేసులో మహ్మద్ ఖాజా ఖాన్ అనే వ్యక్తిని జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా భువనగిరి సబ్ జైలుకు తరలించారు. 22వ తేదీన మెడికల్ చెక్ అప్ నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లిన సమయంలో పోలీసుల కళ్లు కప్పి పరారయ్యాడు. పరారైన ఖైదీ విషయం బయటకి రాకుండా జైలు సిబ్బంది జాగ్రత్తపడ్డట్లు సమాచారం. అనంతరం ఖైదీని పట్టుకొని సబ్ జైలుకు తరలించారు.

G9 TV తెలుగు
తెలంగాణ వీణ
తెలుగు దినపత్రిక
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

Lion Satyanarayana
Email : infocheckintours@gmail.com
చెక్ ఇన్ ఎయిర్ ట్రావెల్స్
ALL DOMESTIC & INTERNATIONAL AIR TICKETS
★ TOUR PACKAGES ★ MONEY TRANSFER
★ FOREX ★ PASSPORT&VISA
Check-In
AIR TRAVELS
eMail.checkinairtravel@gmail.com, www.checkinairtravels.com
Add: GLOBE ARCADE, FLAT NO-101-B, OPP. ECIL BUSSTAND
ECIL MAIN ROAD, HYDERABAD -62
7569615757, 9618391333, 040 40203141



తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
29 మంగళవారం, అక్టోబర్ 2024



# క్రీడలు



## న్యూజిలాండ్ తో కీలకం కానున్న వాంఖడే టెస్ట్

ఒకప్పుడు భారత్ బలమే స్పిన్. ఇప్పుడు స్పిన్ బౌలింగ్ ను ఎదుర్కోవడంలో ఇబ్బందులు పడుతోంది. శ్రీలంక టూర్ లో వన్డే సిరీస్ ను కోల్పోయిన రోహిత్ సేన ఇప్పుడు స్వదేశంలోనే టెస్ట్ సిరీస్ ను కోల్పోయింది. పెద్దగా అంచనాలు లేకుండానే భారత్ న్యూజిలాండ్ చేతిలో ఏకంగా 113 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్చేరాలంటే ఇకపై భారత్ వరుసగా విజయాలు సాధించాలి. దీంతో న్యూజిలాండ్ తో వాంఖడే టెస్ట్ కీలకంగా మారింది. భారత స్టార్ ఆటగాళ్ల అనుభవానికి కూడా ఈ మ్యాచ్ సవాలు విసరబోతోంది. టీమిండియా పరువు నిలబడాలంటే ఆఖరి టెస్టులో తప్పకుండా విజయం సాధించాలి. లేదంటే కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఇమేజ్ డ్యామేజ్ అవుతుందని చర్చ జోరుగా జరుగుతోంది. న్యూజిలాండ్ తో మూడో టెస్ట్ కు ముందు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సంచలన నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఓ రకంగా సీనియర్లకు కూడా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లే అని కామెంట్లు సైతం వినిపిస్తున్నాయి. ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్ ను రద్దు చేసినట్టుగా కథనాలు వెలువడుతున్నాయి. ఎవరైనా సరే ప్రాక్టీస్ సెషన్ లో పాల్గొనాల్సిందేనని కఠినంగా గౌతమ్ గంభీర్ హెచ్చరించినట్టుగా తెలుస్తోంది. సాధారణంగా స్టార్ ప్లేయర్లకు ఆప్షనల్ ప్రాక్టీస్ నుంచి ఇందులో మినహాయింపును ఇస్తారు. ఇందులో స్టార్ బ్యాటర్స్, స్టార్ బౌలర్స్ పాల్గొంటారా లేదా అనేది వారి ఆసక్తి మీదే ఆధారపడి ఉండేది. అసలైన మ్యాచుకు ముందు గాయపడతారనే భయంతో ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్ ను నిర్వహిస్తూ ఉంటారు. అయితే వాంకడే టెస్ట్ కు ముందు అలాంటి ఛాన్సులు లేనట్టేనని ప్రచారం జరుగుతోంది. కోహ్లీ, రోహిత్, బుమ్రా వంటి వాళ్లకు కూడా సీరియస్ గా ప్రాక్టీస్ చేయాల్సిందేనని కథనాలు వస్తున్నాయి. పూణేలో స్టార్ ప్లేయర్లు కూడా స్పిన్ ను సమర్థవంతంగా ఎదురుకోలేకపోయారు. విరాట్ స్పిన్ బలహీనతలు పదేపదే బయట పడుతున్నాయి. టెస్టుల్లో రోహిత్ శర్మ సైతం నిలకడగా రాణించలేకపోతున్నాడు. అందుకే బ్యాటర్స్ అందరికీ ప్రత్యేకంగా స్పిన్ బౌలింగ్ లో ప్రాక్టీస్ సెషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో గౌతమ్ గంభీర్ ఉన్నాడని టాక్ వినిపిస్తోంది. న్యూజిలాండ్, టీమిండియా మధ్య నవంబర్ 1వ తేదీన మూడు టెస్టుల ఫార్మాట్ ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్లో గెలిచి సిరీస్ ను క్లీన్ స్వీప్ చేయాలని కివిస్ ఆరాటపడుతోంది. భారత్ లో చరిత్ర సృష్టించాలని ఆరాటపడుతోంది. ఇదే సమయంలో సిరీస్ లో న్యూజిలాండ్ ఆధిక్యాన్ని 2-1కి తగ్గించడం పైన రోహిత్ శర్మ ఫోకస్ చేసింది. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ఆతిథ్య జట్టు ఆత్మ విశ్వాసం సాధించాలని అనుకుంటుంది. మూడో మ్యాచ్కు ముందు ఈనెల 30, 31న భారత్ ప్రాక్టీస్ సెషన్ లో పాల్గొనబోతోంది. వ్యూహాలు మార్చి రోహిత్ సేన సక్సెస్ అవుతుందా. కివీస్ పైన పంజా విసురుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. శుక్రవారం నుంచి ఇండియా %-% న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తుది జట్టులో మూడు మార్పులు చేసే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. బుమ్రా , రిషబ్ పంత్ , రవీంద్ర జడేజాలకు విశ్రాంతి ఇవ్వాలని మేనేజ్మెంట్ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.




## రాజీనామా చేసిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు కోచ్

గత కొన్ని సంవత్సరాలుగా పాకిస్తాన్ క్రికెట్ జట్టు పరిస్థితి ఏమాత్రం బాగోలేదు. ఆటగాళ్లలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే దాకా వెళ్లాయి. ఈ క్రమంలో జట్టు మెగా టోర్నీలలో దారుణమైన ఆట తీరు ప్రదర్శించింది. స్వదేశంలోనూ వరుసగా టోర్నీలను పర్యాటక జట్లకు అప్పగించింది. ఈ క్రమంలో ఇటీవల ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన మొదటి టెస్టులోనూ ఓటమిపాలైంది. అంతకుముందు బంగ్లాదేశ్ జట్టుతో జరిగిన టెస్ట్ సిరీస్ ను 0-2 తేడాతో కోల్పోయింది. ఇన్ని పరిణామాలు ఆ జట్టు భవితవ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. దీంతో పాకిస్తాన్ జట్టు కోచ్ గా కిర్ స్టెన్ ను నియమించారు. ఆరు నెలల క్రితం ఆయన కోచ్ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆయన కోచ్ గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జట్టును గాడిలో పెట్టడానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆయనప్పటికీ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఆటగాళ్ల వ్యవహార శైలి ఏమాత్రం మెరుగు పడలేదు. గొడవలు, భిన్నాభిప్రాయాలు సర్వ సాధారణమయ్యాయి. దీంతో అతడు తన కోచ్ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయాడు.కిర్ స్టెన్ కోచ్ పదవి నుంచి తప్పుకుండా నేపథ్యంలో వైట్ బాల్ ఫార్మాట్ బాధ్యతలను టెస్ట్ జట్టు కోచ్ గిలెస్పీ కి అప్పగించే యోచనలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఉన్నట్టు తెలుస్తోంది. గ్యారీ కిర్ స్టెన్ దక్షిణాఫ్రికా జట్టుకు చెందిన ఒకప్పటి ఆటగాడు. గిబ్స్, పొలాక్, ఎన్తిని వంటి సహచరులతో దక్షిణాఫ్రికా జట్టును తిరుగులేని స్థాయిలో నిలబెట్టాడు. 2011 లో భారత్ వన్డే ప్రపంచ కప్ గెలవడంలో కోచ్ గా కిర్ స్టెన్ కీలక పాత్ర పోషించాడు. అయితే ఈ ఏడాది మే నెలలో పాకిస్తాన్ జట్టుకు వైట్ బాల్ టీం కోచ్ గా బాధ్యతలు స్వీకరించాడు. అయితే ఆ మరుసటి నెలలో అమెరికా %-% వెస్టిండీస్ వేదికగా టి20 వరల్డ్ కప్ జరిగింది. ఆ టోర్నీలో పాకిస్తాన్ జట్టు అమెరికాపై ఓటమిపాలైంది. అత్యంత అనామకంగా గ్రూప్ దశ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో జట్టుబాగు కోసం కిర్ స్టెన్ ఎన్ని సూచనలు చేసినా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు పట్టించుకోవడం మానేసింది. జట్టు ఆటగాళ్లు కూడా అదే ధోరణి కొనసాగించారు. దీంతో ఆ జట్టుతో వేగలేక కిర్ స్టెన్ పదవి నుంచి తప్పుకున్నాడు. అయితే పాకిస్తాన్ వేదికగా మరో నాలుగు నెలల్లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఈ నేపథ్యంలో కోచ్ కిర్ స్టెన్ తన పదవికి రాజీనామా చేయడం సంచలనంగా మారింది. "ఆ జట్టుతో నేను వేగలేను. నావల్ల కాదు. ఆటగాళ్లు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. జట్టు మేనేజ్మెంట్ కూడా అదేవిధంగా ధోరణి కొనసాగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జట్టును ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. అందువల్లే నా పదవికి రాజీనామా చేస్తున్నానని" కిర్ స్టెన్ తన అంతరంగికులతో వాపోయాడని అంతర్జాతీయ మీడియా తన కథనాలలో పేర్కొన్నది. ఛాంపియన్స్ ట్రోఫీ ఘనంగా నిర్వహించాలని భావించిన పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు.. కోచ్ కిర్ స్టెన్ తీసుకున్న హఠాత్ నిర్ణయం ఒక్కసారిగా ప్రకంపనలకు కారణమవుతోంది.

## ఎందుకు రుతురాజ్ గైక్వాడ్ కెరీర్‌తో ఆడుకుంటున్నారు

### టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్

ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్‌కు చోటు దక్కలేదు. దాంతో సోషల్ మీడియాలో బీసీసీఐ సెలక్షన్ కమిటీపై ట్రోల్స్ వచ్చాయి. రుతురాజ్ యెల్లో జెర్సీ (చెన్నై సూపర్ కింగ్స్ జెర్సీ) వేసుకోవడం వల్లే ఎంపిక చేయలేదని కామెంట్లు చేశారు. రుతురాజ్‌ను సెలక్ట్ చేయకపోవడంపై టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా-ఏతో మ్యాచ్‌లకు జట్టును నడిపించే రుతురాజ్.. ప్రధాన టీమ్‌లో చోటు దక్కించుకోలేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నాడు. భారీగా పరుగులు చేసినా అవకాశం రాకపోతే ఇంకేం చేయాలి? అని ప్రశ్నించాడు. కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ%ూ% 'భారత క్రికెట్‌లో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. మయాంక్ యాదవ్ నెట్స్‌లో కొన్ని ఓవర్ల పాటు బౌలింగ్ వేస్తున్నాడని చెప్పారు. చివరకు శివమ్ దూబె, రియాన్ పరాగ్ మాదిరిగా ఫిట్‌గా లేడని ప్రకటించారు. రుతురాజ్ గైక్వాడ్ విషయంలో ఏం చేస్తున్నారో మీకైనా తెలుసా?. అతడికి కూడా ఎందుకు ఎంపిక కావడం లేదో తెలియదు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సెంచరీలు చేసినా టెస్టుల్లో అవకాశం రాలేదు. భారీగా పరుగులు చేసినా అవకాశం రాకపోతే ఇంకేం చేయాలి?' అని ప్రశ్నించాడు.'దేశవాళీ క్రికెట్‌లో సెంచరీలు చేసిన అభిమన్యు ఈశ్వరన్‌ను తీసుకోవడం మంచి నిర్ణయం. కానీ రుతురాజ్ గైక్వాడ్‌ను పక్కన పెట్టడంలో లాజిక్ ఏంటో సెలెక్టర్లు చెప్పాలి. ఎందుకు అతడి కెరీర్‌తో ఆడుకుంటున్నారు?. రుతురాజ్ నుంచి ఇంకేం ఆశిస్తున్నారో చెప్పాలి. మీ ప్రణాళిక ఏంటి?.. ప్రత్యర్థిపై రోజంతా హిట్టింగ్ చేయగల సత్తా ఉన్న బ్యాటర్. కానీ అంతర్జాతీయ క్రికెట్‌కు వచ్చేసరికి మీరు పక్కన పెట్టేస్తున్నారు. రుతురాజ్‌కు కేవలం రెస్టాఫ్ ఇండియా లేదా ఇండియా-ఏ తరఫున మాత్రమే అవకాశం ఇస్తారు. ఇంకెన్నాళ్లు వెయిట్ చేయిస్తారు' అని శ్రీకాంత్ అన్నాడు.





## కెప్టెన్ గా రాహుల్ ను వదులుకోవడానికి సిద్ధమైన లక్నో

లక్నో జట్టు అందరూ అనుకున్నట్టుగానే అడుగులు వేస్తోంది. 2025 ఐపీఎల్ సీజన్లో కెప్టెన్ గా రాహుల్ ను వదులుకోవడానికి సిద్ధమైంది. అంతేకాదు అతడి స్థానంలో కొత్త కెప్టెన్ ను నియమించుకోవడానికి కూడా రెడీ అయింది.. మరో మూడు రోజులు మాత్రమే రిటైన్ లిస్ట్ సమర్పించడానికి గడువు ఉంది. దానికంటే ముందే లక్నో జట్టు సంచలన నిర్ణయాలు తీసుకుంది.. ఇద్దరు అనామక ఆటగాళ్లతో పాటు, ముగ్గురు స్టార్ ఆటగాళ్లను జట్టులో ఉంచుకోనుంది. నిబంధనల ప్రకారం ఈనెల చివరి తేదీ లోపు యాజమాన్యాలు తమ రిటైన్ లిస్టును సమర్పించాల్సి ఉంది.. ఒక్కో జట్టు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. అయితే ఇందులో గరిష్టంగా ఐదుగురు క్యాప్డ్ ఆటగాళ్లు , ఇద్దరు అన్ క్యాప్డ్ ఆటగాళ్లకు అవకాశం ఉంది. ఆర్టీఎం కార్డు ద్వారా లేదా బీసీసీ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ధరతో రిటైన్ చేసుకోవడానికి ఫ్రాంచైజీలకు అవకాశం ఉంది. అలా రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు ఫ్రాంచైజీలు వరుసగా 18, 14, 11 కోట్లు ఇవ్వాలి. ఒకవేళ నాలుగో, ఐదో ఆటగాడిని జట్టులోకి తీసుకోవాలి అనుకుంటే 18, 14 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అనామక ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలనుకుంటే నాలుగు కోట్లు చెల్లించాలి. అయితే ఈ నిబంధనల ప్రకారం లక్నో జట్టు ఇద్దరు అనామక ఆటగాళ్లు మోహ్ సిన్ ఖాన్, ఆయుష్ బదోని ని రిటైన్ చేసుకోనుంది. వీరితోపాటు నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్ ని వరుసగా 18, 14, 11 కోట్ల చెల్లించి తీసుకోనుంది. నికోలస్ పూరన్ కు జట్టు సారధ్య బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించుకుంది. మార్కస్ స్టోయినిస్ ను రైట్ టు మ్యాచ్ కార్డు ద్వారా అంటిపెట్టుకోనుంది.కొంతకాలంగా పూరన్ టి20లలో అద్భుతంగా ఆడుతున్నాడు. ఏకంగా గేల్ రికార్డులను కూడా బద్దలు కొడుతున్నాడు. బ్యాటర్ గానే కాదు, వికెట్ కీపర్ గానూ పూరన్ సత్తా చాటుతాడు. అందువల్లే రిటైన్ జాబితాలో ఫస్ట్ ప్రయారిటీగా పూరన్ ను లక్నో జట్టు ఎంచుకుందని తెలుస్తోంది. అయితే జట్టు కెప్టెన్సీ నుంచి బయటికి వెళ్లిపోవడం అనివార్యం కావడంతో.. రాహుల్ వేలంలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ అతడు కనుక వేలంలోకి వస్తే దక్కించుకోవాలని.. కెప్టెన్ గా నియమించాలని బెంగళూరు జట్టు భావిస్తోంది. ఎందుకంటే ఈసారి డూ ప్లె సిస్ కు ఉద్వాసన పలకాలని బెంగళూరు యాజమాన్యం నిర్ణయించుకుంది. అందువల్లే అతని స్థానాన్ని రాహుల్ తో భర్తీ చేయాలని భావిస్తోంది. డూ ప్లెసిస్ గత సీజన్లో అంతగా రాణించలేకపోయాడు. పైగా అతడికి వయసు కూడా ఎక్కువ కావడంతో చురుకుగా ఆడలేక పోతున్నాడు. దీంతో అతడిని బయటికి పంపించి.. రాహుల్ ను కెప్టెన్ చేయాలని బెంగళూరు యాజమాన్యం నిర్ణయించుకుంది.

## అదే నా చిన్నప్పటి కల: నితీశ్ రెడ్డి

ఆస్ట్రేలియాపై ఆడాలనేది తన చిన్నప్పటి కల అని తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి తెలిపాడు. ప్రతి క్రికెటర్‌కు దేశం తరపున టెస్టు క్రికెట్ ఆడటం గౌరవంగా భావిస్తాడని, తనకు ఇప్పుడు అలాంటి అవకాశం రానుండటం ఆనందంగా ఉందన్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ నాయకత్వంలో ఎస్ఆర్‌హెచ్‌లో ఆడానని, ఇప్పుడు అతడికి వ్యతిరేకంగా బరిలోకి దిగాల్సి ఉంటుందని నితీశ్ చెప్పాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌కు నితీశ్ ఎంపికైన సంగతి తెలిసిందే. పేస్ ఆల్‌రౌండర్ లోటును నితీశ్‌తో బీసీసీఐ భర్తీ చేసింది. తాజాగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నితీశ్ కుమార్ రెడ్డి మాట్లాడాడు. 'ప్రతి క్రికెటర్‌కు దేశం తరపున టెస్టు క్రికెట్ ఆడటంను గౌరవంగా భావిస్తాడు. నాకు అలాంటి అవకాశం రానుండటం చాలా ఆనందంగా ఉంది. 2024లో నాకు ప్రతిదీ మంచే జరుగుతోంది. ఆ దేవుడికి కృతజ్ఞతలు. తప్పకుండా మంచి ఆల్‌రౌండర్‌గా రాణిస్తాననే నమ్మకం ఉంది. ఆస్ట్రేలియా జట్టుతో ఆడటం ఎప్పుడూ సవాలే. నాకు అక్కడి పరిస్థితులపై అవగాహన ఉంది. చిన్నప్పటి నుంచి ఆసీస్‌పై ఆడాలనే కల ఉంది. ఇప్పుడు అది నెరవేరుతుందనుకుంటున్నా. ఇప్పుడు ఇండియా-%ూ% మ్యాచ్‌పైనే దృష్టి పెట్టా. ఐపీఎల్ ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ నాయకత్వంలో ఎస్ఆర్‌హెచ్‌లో ఆడాను. ఇప్పుడు అతడికి వ్యతిరేకంగా ఆడాల్సి ఉంటుంది' అని నితీశ్ చెప్పాడు. ఐపీఎల్ 2024లో ఎస్ఆర్‌హెచ్ తరఫున నితీశ్ రెడ్డి సత్తాచాటాడు. 303 పరుగులు చేసి.. 3 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ ప్రదర్శనతో భారత జట్టులో చోటు సంపాదించాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో అరంగేట్రం చేశాడు. ఇప్పుడు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లే భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇప్పటివరకూ 21 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన నితీశ్.. 708 పరుగులు, 55 వికెట్లు తీశాడు. **ఆస్ట్రేలియా సిరీస్‌కు భారత జట్టు:** రోహిత్, బుమ్రా, జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, శుభ్‌మన్, కోహ్లీ, రాహుల్, పంత్, సర్ఫరాజ్, జురెల్, అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ రాణా, నితీశ్, సుందర్.





తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
29 మంగళవారం, అక్టోబర్ 2024
సినిమా




# భారీ క్యూ ఉంది.. ఏదీ ఫైనల్ చేస్తారో

## చిరంజీవి ఒకే కోసం దర్శకుల ఎదురుచూపులు

చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' చిత్రీకరణ తుదిదశలో ఉంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావలసింది కానీ పలు కారణాలతో వెనక్కి వెళ్లింది. ఈ చిత్రం తర్వాత చిరంజీవి తదుపరి చిత్రం ఏంటనేది ఇప్పుడు చర్చ. ఈ విషయంపై చిరంజీవి కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. 'విశ్వంభర' సంక్రాంతి తర్వాత విడుదల కాబట్టి చిరంజీవి కూడా నెక్ట్స్ ఏంటి అనే విషయంలో కూల్‌గా ఉన్నారు. అయితే ఆయనతో సినిమా కోసం పలు దర్శకులు, రచయితలు వాళ్ల పనులతో బిజీగా ఉన్నారు. చిరు సిగ్నల్ ఇస్తే సెట్స్ మీదకు వెళ్లడానికి కంగారుగా ఉన్నారు. రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి చిరంజీవికి ఓ కథ చెప్పారు. అయితే దర్శకుడు మాత్రం ఆయన కాదు. మోహన్ రాజాతో కలిసి ఆయన వర్క్ చేస్తున్నారు. కథ దాదాపుగా సిద్ధమైంది. చిరు 'ఓకే' అంటే ప్రాజెక్ట్ సెట్ అయిపోయినట్లే. చిరంజీవి కోసం బీవీఎస్ రవి ఓ సామాజిక సందేశం నిండిన కథ రాశారట. 'ఠాగూర్' తరహా సినిమా అని, బలమైన సందేశంతో పాటు, కమర్షియల్ హంగులన్నీ ఉంటాయని తెలుస్తోంది. ఇదే విషయంపై బీవీఎస్ రవి కూడా ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు. "చిరంజీవి అంటే, పాటలు డాన్సులు గుర్తొస్తాయి. ఆ తరహా చిత్రాలు ఆయనే ఎన్నో చేశారు. అలాగే సందేశాత్మక చిత్రాలు చేశారు. వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఓ పెద్ద స్టార్ బలమైన సందేశాన్ని ఇస్తే , చాలామందికి చేరువ అవుతుందని, తాను అలాంటి కథే సిద్ధం చేశానని చెప్పుకొచ్చారు బీవీఎస్ రవి. 'విశ్వంభర' తమ సినిమానే మొదలవుతుందని కూడా చెప్పారు. గతంలో కల్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వంలో ఓ సినిమా అనుకున్నారు. అది పట్టాలెక్కలేదు. అది కూడా క్యూలో ఉందా లేదా అనేది చూడాలి. హరీష్ శంకర్ కూడా ఒక సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారు. 'విశ్వంభర' తరవాత ఏ సినిమా చేయాలన్న విషయంలో చిరంజీవి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. బీవీఎస్ రవి కథ కూడా లైన్ లో ఉందని, అయితే చిరు అంగీకారం తెలపాలని అంటున్నారు.




## సాయి పల్లవి అంటే.. సాయి పల్లవే ఆమె నటనకు ఫిదా...

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి, శివకార్తికేయన్ జంటగా విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్న సినిమా అమరన్. ఈ సినిమా దీపావళి కానుకగా పలు భాషల్లో అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో జోరు పెంచింది. కానీ.. సాయి పల్లవి ప్రమోషన్స్ అటెండ్ కాకుండా చేసిన పని చూస్తే మీరు గ్రేట్ అనాల్సిందే.. ఇంతకీ సాయి పల్లవి ప్రమోషన్స్‌కి ఎందుకు అటెండ్ కావడం లేదు.. ఇంతకీ సాయి పల్లవి ఎం చేశారంటే.. అమరన్.. ఈ సినిమాని కాశ్మీర్ నేపథ్యంలో శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత సంఘటనలతో రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ : ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలిటరీ' పుస్తకం ఆధారంగా యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాయి పల్లవి తన సోషల్ మీడియా ఖాతాలో ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశారు. "అమరన్ కోసం ప్రమోషన్‌లను ప్రారంభించే ముందు నేను నేషనల్ వార్ మెమోరియల్‌ని సందర్శించాలనుకున్నాను. ఈ పవిత్రమైన ఆలయంలో, మన కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రతి బ్రేవ్‌హార్ట్ జ్ఞాపకార్థం వేలకొద్దీ 'ఇటుక లాంటి పలకలు' ఉన్నాయి. మేజర్ ముకుంద్ వరదరాజన్, సిపాయి విక్రమ్ సింగ్ లకు నివాళ్లు తెలుపుతున్నపుడు నా ఒళ్ళు పులకరించి పోయింది" అంటూ పోస్ట్ చేశారు. దీంతో అందరు సాయి పల్లవి గెస్చర్ కి హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## అలాంటి వార్తలపై నయన మండిపాటు

### అలాంటి ప్రయత్నం చేయలేదు : నయనతార

హీరోయిన్లు తాము చేసే సినిమాల గురించే కాకుండా ఇతర విషయాలపైనా వార్తల్లో నిలుస్తుంటారు. అందులో వారి ప్రమేయం ఉండొచ్చు ఉండకపోవచ్చు. ఒక్కోసారి ఏ సంబంధం లేకుండానే వార్తలకెక్కుతారు. తాజాగా అలాంటి వార్తలపై నయనతార మండిపడ్డారు. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను ఆమె ఖండించారు. దేవుడు ఇచ్చిన తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని, ఆ ఆలోచన కూడా రాలేదని తెగేసి చెప్పారు. నయన్ ఇండస్ట్రీ లో అడుగుపెట్టిన కొన్నాళ్ల తర్వాత పలు చిత్రాల్లో ఆమె ముఖం తొలి సినిమాలో కంటే సన్నగా కనిపించింది. దీంతో ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారనే రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా నయనతార వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆదివారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె దీనిపై మాట్లాడారు. "నా కనుబొమ్మలు అంటే నాకు చాలా ఇష్టం. వాటి ఆకారం ఎప్పుడూ మారుస్తూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వాటిని మార్చుతుంటాను. వాటి కోసం ఎంతో సమయాన్ని కేటాయిస్తాను. కనుబొమ్మల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ముఖంలో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకొని ఉంటారు. వాళ్లు అనుకున్నది నిజం కాదు.. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావచ్చు. ఒక్కోసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తుంటాయి. ఇంకోసారి అవి లోపలికి వెళ్లినట్లు అనిపిస్తుంటుంది. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు.. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార అన్నారు. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లోనూ బిజీ అయ్యారు. గతేడాది 3 సినిమాలతో అలరించిన నయన్ ప్రస్తుతం ఐదు సినిమాలతో బిజీగా ఉన్నారు.

## ఖలేజా గురించి మాట్లాడితే గొడవపడేవాడిని : విజయ్ దేవరకొండ



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం లక్కీ భాస్కర్. గత ఏడాది 'సార్' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలు విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుంది.ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు మేకర్స్. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథులుగా రౌడి హీరో విజయ్ దేవరకొండతో పాటు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ వచ్చి సందడి చేశారు. అయితే ఈ వేడుకలో విజయ్ మాట్లాడుతూ.. తనకు సితార ఎంటర్‌టైనమెంట్స్‌తో మంచి అనుభందం ఉందని విజయ్ తెలిపాడు. పెళ్లి చూపులు మూవీ విజయం సాధించిన తర్వాత నా ఫస్ట్ చెక్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి అందుకున్నాను. త్రివిక్రమ్ గారు నన్ను ఆఫీస్‌లో కుర్చోబెట్టి నా ఫస్ట్ చెక్ ఇప్పించారు. ఇది జరిగి 7 ఏండ్లు అవుతుంది. సితార అప్పుడు చెక్ ఇస్తే.. ఇన్ని సంవత్సరాలు పట్టింది సినిమా చేయడానికి. ఇప్పుడు మేం కలిసి వీడీ12 చేస్తున్నాం. త్రివిక్రమ్ సర్‌ని ఫస్ట్ టైం కలవడం నా లైఫ్‌లో మర్చిపోలేని క్షణం. నా పర్సనల్ ఫేవరెట్ చిత్రాలు అతడు, ఖలేజా. ఖలేజా సినిమా అయితే ఎవడైనా నచ్చలేదు అంటే నేను వాడితో గొడవ పడే వాడిని అంటూ విజయ్ చెప్పుకొచ్చాడు. అలాంటి మనిషి నాకు చెక్ ఇచ్చి నువ్వు స్టార్ అవుతావు అంటూ చెప్పాడు. ఎవరు సినిమాలు చూస్తూ పెరిగామో ఆ వ్యక్తి మనల్ని స్టార్ట్ అవుతారు అని చెప్పినప్పుడు చాలా ఆనందం వేసింది అంటూ విజయ్ చెప్పుకోచ్చాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## సాయి పల్లవికి నేను పెద్ద అభిమానిని దిగ్గజ దర్శకుడు మణిరత్నం

తమిళ దిగ్గజ దర్శకుడు మణిరత్నం నటి సాయి పల్లవిని ప్రశంసలతో ముంచెత్తాడు. సాయి పల్లవికి నేను నేను పెద్ద అభిమానిని. తను అంటే చాలా ఇష్టమని. సమయం దొరికినప్పుడు కచ్చితంగా ఆమెతో సినిమా చేస్తానని మణిరత్నం వెల్లడించాడు. కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్, నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం అమరన్. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా ఈ సినిమా రానుండగా.. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ ప్రీ రిలీజ్ వేడుకను గ్రాండ్‌గా జరుపగా ఈ వేడుకకు ముఖ్య అతిథిగా దర్శకుడు మణిరత్నం వచ్చి మాట్లాడాడు. ఈ క్రమంలోనే సాయి పల్లవి గురించి మాట్లాడుతూ.. సాయి పల్లవికి నేను నేను పెద్ద అభిమానిని. తను అంటే చాలా ఇష్టమని. సమయం దొరికినప్పుడు కచ్చితంగా ఆమెతో సినిమా చేస్తానని మణిరత్నం వెల్లడించాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part  Without Written